RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 105 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి గురువారం 16-4-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥చతుర్ధశి రా॥7.08, ఉ.భాద్ర మ॥12.54, వర్జ్యం రా॥ 12.30 -2.02, దుర్ముహూర్తం ఉ॥ 10.01-10.50, శుభ సమయం ఉ॥ 9.00-10.30, రాహుకాలం మ॥1.30-3.00, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

**జగన్ మాజీ సిపిఆర్‌వో శ్రీహరి అరెస్ట్** 2లో

## నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ... ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- వాడీవేడీగా సాగనున్న సమావేశాలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు మిగతా 2లో..

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వండి



### - సీఎం క్యాంపు కార్యాలయంలో కూటమి నేతలతో చంద్రబాబు భేటీ

**అమరావతి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు కీలక భేటీ నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మిగతా 2లో..

## ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

మొదటి సంవత్సరంలో 77 శాతం... రెండో సంవత్సరంలో విద్యార్థులు 81 శాతం పాస్
ఫలితాల్లో అమ్మాయిలదే హవా




**అమరావతి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఉత్తీర్ణత నమోదు అయ్యింది. గత 12 ఏళ్లలో అత్యధికంగా మొదటి సంవత్సరం విద్యార్థులు మిగతా 2లో..

## టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా కొనసాగింపు... ఇద్దరు క్షేత్రస్థాయి నేతలకు పోలిట్ బ్యూరోలో స్థానం
పార్టీ కార్యవర్గాన్ని పునర్నిర్మించిన చంద్రబాబు



**అమరావతి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టిడిపి కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్‌ను ప్రకటించింది. పార్టీకి ఇప్పటి వరకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేశ్ ఓ రకంగా ప్రమోషన్ పొందారు. మెల్లగా ఆయన చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నారు. ఇష్టపికే పార్టీలో అంతా తానై నడిపిస్తున్నారు. ఇకపోతే తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు. పొలిటిబ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఈ మేరకు పార్టీ ప్రకటించింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది. సీనియర్లకు గౌరవమిస్తూ.. కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ.. సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి అధిష్ఠానం పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు మిగతా 2లో..

## పేలిన గ్యాస్ సిలిండర్లు

- నలుగురు మృత్యువాత



**శ్రీ సత్య సాయి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. గ్యాస్ మంటలు చుట్టు పక్కల వ్యాపించడంతో భారీ ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక మిగతా 2లో..

## దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ సెగలు


నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం... తమిళనాడు సిఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాల ప్రదర్శనకు పిలుపు



**చెన్నై, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** దేశ రాజకీయాల్లో నియోజక వర్గాల పునర్విభజన బిల్లు హాట్ టాపిక్ అయింది. గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాలు మిశ్రమ గళాన్ని వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కేంద్ర తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ పక్రియను దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న 'చారిత్రక అన్యాయం'గా స్టాలిన్ అభివర్ణించారు. 'కేంద్ర ప్రభుత్వం నిప్పుతో చెలగాటం ఆడుతోంది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా?' అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా లబ్ధి చేకూర్చి, దక్షిణాది ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా నేడు తమిళనాడు వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన తెలపాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇంటింటిపై నల్లజెండాలు మిగతా 2లో..

## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

- ❑ శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ❑ ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు




**వాషింగ్టన్, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం మిగతా 2లో..

## ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి

ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించిన ప్రధాని మోదీ

**బెంగుళూరు, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు. "మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధి వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

- నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.
- పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం
- అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.
- 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.
- జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
- రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
- ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.



- నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
- ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్ళు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

## ధైర్యముంటే నా కారు రోజూ చెక్ చేయండి

ఉత్తర్ దినాజ్‌పుర్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో సీఎం మమతా బెనర్జీ



**కలకత్తా, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తాను ప్రయాణిస్తున్న వాహనాన్ని చెక్ చేసేందుకు కేంద్ర బలగాలు యత్నించాయని దీదీ ఆరోపించారు. కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే తనిఖీ చేయాలంటూ ఆదేశాలు అందాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్ దినాజ్‌పుర్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మమత మాట్లాడుతూ "ఈరోజు ఉదయం కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా మిగతా 2లో..

పాపం అనేది ఏదైనా ఉంటే ఇది ఒక్కటే - నీవు దుర్బలుడవని లేదా ఇతరులు దుర్బలురని అనడం. కోరనూవద్దు, త్రోసిపుచ్చనూ వద్దు. లభించిన దానిని స్వీకరించు.

## నేటి మనదేశం సంపాదకీయం

# దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి !

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోంది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంట్లో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్ధత ఉంటుంది. సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఏఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం పొందితే మంచిది. పార్లమెంటులో సుదీర్ఘ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు అవగాహన కలిగేలా ఉండాలి. రాజకీయ పార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళా రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిఉంది. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుంది. లోక్సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతుందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550 గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్సభ సభ్యులను లోక్సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఒక పజిల్ లాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేసే చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

# మహిళా బిల్లుకు ఓకే... డీలిమిటేషన్ బిల్లుకు నో

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (ఆర్ఎన్ఎ):** పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు.



డీలిమిటేషన్ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

# జగన్ మాజీ సిపిఆర్వో శ్రీహరి అరెస్ట్

- సిఎంకు వ్యతిరేకంగా తప్పుడు పోస్టులు పెట్టడంపై కేసు
- అరెస్టును ధృవీకరించిన వైసిపి నేతలు



**అమరావతి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైఎస్ జగన్ మాజీ సీపీఆర్వో పూడి శ్రీహరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబుకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో శ్రీహరి తప్పుడు పోస్టులు పెట్టించారనే ఆరోపణలు వచ్చాయి. చంద్రబాబు చేతిలో కత్తిపెట్టి యానిమేషన్ పోస్టింగ్లు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందడంతో చిత్తూరు జిల్లాలో కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులోనే బుధవారం శ్రీహరిని తాడేపల్లిలోని నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. ఆయన మొబైల్, ల్యాప్టాప్ను స్వాధీనం చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్కు పూడి శ్రీహరి సీపీఆర్వోగా పనిచేశారు.. ఆయన ప్రస్తుతం వైసిపి మీడియా విభాగం ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. పార్టీ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు వైసిపి తెలిపింది. ఉదయం తాడేపల్లిలోని శ్రీహరి ఇంటికి వచ్చిన పోలీసులు సోదాలు చేసి.. ఫోన్, ల్యాప్టాప్ను స్వాధీనం చేసుకుని శ్రీహరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అయితే పూడి శ్రీహరిని చిత్తూరు జిల్లా కుప్పం పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో అరెస్ట్ చేసినట్లు మాజీ మంత్రి అంబటి రాంబాబు ట్వీట్ చేశారు. చిత్తూరు 2 టౌన్ సీఐ పూడి శ్రీహరిని దౌర్జన్యంగా తీసుకెళ్లారని.. ఈ అక్రమ అరెస్ట్ను ఖండిస్తున్నాను అన్నారు. పూడి శ్రీహరి గతంలో పలు మీడియా సంస్థల్లో పనిచేశారు.. అనంతరం 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ పాదయాత్ర చేసిన సమయంలో శ్రీహరి కీలకంగా వ్యవహరించారు. మీడియాకు సంబంధించిన వ్యవహారాల ను శ్రీహరి చక్కదిద్దారు. అలాగే వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రపై అడుగడుగునా అంతరంగం పేరుతో ఓ పుస్తకాన్ని కూడా రాశారు.

## మొదటి పేజీ తరువాయి

# ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

77 శాతం పాస్ అయ్యారు. రెండో సంవత్సరం విద్యార్థులు 81 శాతం పాస్తో రెండో అత్యుత్తమ ఫలితాలను సాధించారు. విద్యార్థులు తమ ఫలితాలనువెబ్సైట్లో చూసుకోవచ్చు. మెసేజ్ను 9552300009 నంబర్కు వాట్సాప్లో పంపితే కూడా ఫలితాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీన కళాశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సరం 54 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండో సంవత్సరం జీజేసీల్లో 68 శాతం పాస్ అయ్యారు. ఇది గత 12 ఏళ్లలో అత్యధిక ఉత్తీర్ణతగా నమోదు అయింది. విద్యార్థులు, ప్రిన్సిపల్స్, లెక్చరర్ల సమిష్టి కృషి వల్లే ఈ ఫలితాలు వచ్చాయని అధికారులు తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్స్ కోసం అందరూ కలిసి కృషి చేయడం ఫలించిందని ప్రశంసించారు. ఇంటర్ ఫలితాల్లో అబ్బాయిల కంటే అమ్మాయిలు మెరుగైన ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 85శాతంగా నమోదయ్యింది. ప్రథమ సంవత్సరం అమ్మాయిల పాస్ శాతం 81శాతంగా నమోదు అయ్యింది. రీకౌంటింగ్ / రీవెరిఫికేషన్ దరఖాస్తులలను ఏప్రిల్ 20 నుంచి 27 వరకు వరకు స్వీకరిస్తారు. స్కాన్ కాపీతో రీవెరిఫికేషన్కు అవకాశం ఉంది. సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుంచి జూన్ 4 వరకు థియరీ పరీక్షలు, జూన్ 7 నుంచి 11 వరకు ప్రాక్టికల్స్ రెండు సెషన్లలో పరీక్షల నిర్వహణ ఉంటుంది. మొదటి సంవత్సరం పాస్ అయిన వారికి ఇంప్రూవ్మెంట్కు ఛాన్స్ ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పూర్తి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తిరిగి కృషి చేసి విజయం సాధించాలని వారికి పిలుపు ఇచ్చారు. ఈ సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక బలం ఇవ్వాలని, భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని విజయాలు సాధించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

రాని వారికి పార్టీ పదవుల ద్వారా న్యాయం కల్పించింది. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు చేశారు. 29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10 రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్లు-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు-59, రాష్ట్ర కార్యదర్శులు-77 తో పునర్నిర్మించారు. ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్ఛార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకకున్నారు. పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్ అత్యున్నత స్థాయికి ఎదిగారు. రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించారు. జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు చేశారు. 185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించింది. బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి చంద్రబాబు కమిటీల కూర్పు చేపట్టినట్లు అర్థంఅవుతోంది.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వండి

సమావేశమయ్యారు. పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చించారు. బిల్లు ఆమోదం పొందాక చేపట్టాల్సిన నారీ శక్తి విజయోత్సవాలు, కార్యాచరణపై సమాలోచనలు చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని కోరుతూ రాష్ట్రంలోని వివిధ పార్టీల అధ్యక్షులకు, ఎంపీలకు ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖలు రాశారు.

# దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ సెగలు

ఎగురవేయాలని రాష్ట్ర ప్రజలను స్టాలిన్ కోరారు. 'తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది' అంటూ ఆయన ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల లోకసభ సీట్లు తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరుగుతాయన్నది సీఎం స్టాలిన్ అభియోగం. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల గొంతు నొక్కడం సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని, ఇప్పుడు రాజకీయంగా కూడా మొండిచేయి ఎదురవుతుందని ఆయన వాదిస్తున్నారు. దక్షిణాది ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్రం ఈ బిల్లును ఉపసంహరించుకోకపోతే భారీ మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు. మరోవైపు, రేపు పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న తరుణంలో విపక్షాలు ఐక్య పోరాటానికి సిద్ధమవుతున్నాయి. రాజ్యాంగ విలువలు, సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలని కోరుతూ గళం ఎత్తేందుకు సిద్ధమయ్యాయి. ఈ పోరు కేవలం సీట్ల కోసం మాత్రమే కాదు, దక్షిణాది రాష్ట్రాల ఉనికి, గౌరవం కోసమని విపక్ష పార్టీలు చెబుతున్నాయి.

# ధైర్యముంటే నా కారు రోజూ చెక్ చేయండి

కేంద్ర బలగాలు నా కారును చెక్ చేయడానికి ప్రయత్నించాయి. ఒకవేళ మీకు ధైర్యం ఉంటే నా కారును రోజూ తనిఖీ చేయండి. కేవలం టీఎంసీ నాయకుల వాహనాల్లోనే ఈ చెకింగ్లు జరుగుతున్నాయి" అని ఆరోపించారు. దీదీ మేనల్లుడు, తృణమూల్ నాయకుడు అభిషేక్ బెనర్జీ వాహనాన్ని కూడా తనిఖీ చేసినట్టు సమాచారం. " కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే లక్ష్యంగా చేసుకొంటున్నారు. ఇది కుట్రపూరిత చర్యే" అని టీఎంసీ నేత కునాల్ ఘోష్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, బెంగాల్లో 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29న రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి.

# కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

# పేలిన గ్యాస్ సిలిండర్లు

సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో గాయపడిన వారిని వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గ్యాస్ మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు భయపడి బయటకు పరుగులు తీశారు.

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజిం చడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించు కోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్పర్సన్గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్గానీ, ఆయన నామినీగానీ ఎక్స్అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.


**దక్షిణ రైల్వే**

1.పని పేరు: అరకోణం రైల్వే స్టేషన్ను ABSS దశ-1 (అదనపు అంశాలు) కింద పునర్నిర్మాణం చేయడం – దీనికి సంబంధించిన విద్యుత్ ఏర్పాట్లు.
2.ఈ-టెండర్ నోటీసు సంఖ్య: MAS/EG S/ET/02/2026-2027, తేదీ: 13-04-2026
3.టెండర్ సంఖ్య: ME-29-II-1086R-2026
4.పని విలువ: రూ. 1,98,93,604/-
టెండర్కు సంబంధించిన మరిన్ని వివరాలు చూడడానికి: WWW.IREPS.GOV.IN

Sr.DEE/G/MAS

**దక్షిణ రైల్వే**

సంఖ్య: M-TRD-29-I-OT-2026-27-04 తేదీ: 13.04.2026

భారత రాష్ట్రపతి తరపున, చెన్నై డివిజన్, దక్షిణ రైల్వే, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ శాఖకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్, చెన్నై - 3 వారు అనుభవం కలిగిన కాంట్రాక్టర్ల నుండి క్రింది పనుల కోసం ఆన్లైన్ టెండర్లు ఆహ్వానిస్తున్నారు. మరిన్ని వివరాలకు www.ireps.gov.in చూడండి.

| క్రమ సంఖ్య | టెండర్ సంఖ్య / పనిపేరు | విలువ (రూ.) | ముగింపు తేదీ/ సమయం |
|---|---|---|---|
| 1. | టెండర్ సంఖ్య: M-TRD-29-I-OT-2026-27-04<br>చెన్నై డివిజన్లో రైళ్ల వేగాన్ని 130 కి.మీ/గంవరకు పెంచుట కోసం వక్రాల పునర్వ్యవస్థీకరణ కారణంగా ప్రస్తుతం ఉన్న OHE ఏర్పాట్లలో మార్పులు చేయుట. | 56060845.60 | 04.05.2026 (15.00 గంటలకు) |

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / డివిజనల్ రైల్వే మేనేజర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, చెన్నై - 3

**దక్షిణ రైల్వే**

చెన్నై డివిజన్ - మెకానికల్ బ్రాంచ్ (ENHM విభాగం)
GEM బిడ్ నెం.: GEM/2026/B/7431472 తేదీ: 13.04.2026

డివిజనల్ రైల్వే మేనేజర్ / మెకానికల్ బ్రాంచ్ / ENHM విభాగం / చెన్నై డివిజన్, దక్షిణ రైల్వే, చెన్నై - 600003, భారత రాష్ట్రపతి తరపున క్రింది పనికి సంబంధించిన ఆన్లైన్ టెండర్లు ఆహ్వానిస్తున్నది. ఈ పని వివరాలు GEM బిడ్ పత్రంలో ఇవ్వబడిన ప్రకారం www.gem.gov.in ఈ-టెండర్ పోర్టల్లో అందుబాటులో ఉన్నాయి.టెండర్ దారులు / బిడ్డర్లు "తాంబరం రైల్వే స్టేషన్లో 1461 రోజుల పాటు మానవ వనరుల ఆధారంగా మెకనైజ్డ్ క్లీనింగ్ మరియు తాంబరం కాలనీ లో 1253 రోజుల పాటు ఫలితాల ఆధారంగా మెకనైజ్డ్ క్లీనింగ్" పనికి దరఖాస్తు చేయాలనుకుంటే, వారు తప్పనిసరిగా www.gem.gov.in పోర్టల్లో నమోదు చేసుకుని, ఆన్లైన్ ద్వారా మాత్రమే టెండర్ సమర్పించాలి. EMD మొత్తాన్ని కూడా GEM పోర్టల్ ద్వారా ఆన్లైన్లో చెల్లించవచ్చు.

| | |
|---|---|
| వివరణ | తాంబరం రైల్వే స్టేషన్లో 1461 రోజుల పాటు మానవ వనరుల ఆధారంగా మెకనైజ్డ్ క్లీనింగ్ మరియు తాంబరం కాలనీలో 1253 రోజుల పాటు ఫలితాల ఆధారంగా మెకనైజ్డ్ క్లీనింగ్ |
| స్థానం | తాంబరం రైల్వే స్టేషన్ మరియు తాంబరం కాలనీ |
| టెండర్ విలువ | రూ. 21,37,06,967.48 |
| ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ | రూ. 12,18,530/- |
| పని పూర్తి కాలం | 4 సంవత్సరాలు |

టెండర్ ముగింపు తేదీ మరియు సమయం:04.05.2026 సాయంత్రం 5:00 గంటలు టెండర్ విలువ, EMD వివరాలు మరియు బిడ్ సమర్పణకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం www.gem.gov.in వెబ్ పోర్టల్ను సందర్శించండి.

సహాయ పర్యావరణ & హౌస్కీపింగ్ మేనేజర్,
డివిజనల్ రైల్వే మేనేజర్ / మెకానికల్ - ENHM విభాగం తరపున
చెన్నై డివిజన్, దక్షిణ రైల్వే - 600003

# స్పోర్ట్స్ కాంప్లెక్స్‌'ను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

## - అంతర్జాతీయ స్థాయి వసతులు



**చంద్రగిరి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చంద్రగిరి నియోజకవర్గ పర్యటన అత్యంత వైభవంగా సాగింది. తొలుత పట్టణంలోని టవర్ క్లాక్ వద్దకు చేరుకున్న మంత్రికి కూటమి నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాలుస్తూ, గజమాలతో ఘనస్వాగతం పలికారు. భారీ ఎత్తున తరలివచ్చిన జనసందోహం మంత్రికి నీరాజనాలు పలికారు. ప్రతి ఒక్కరినీ లోకేష్ ఆప్యాయంగా పలకరిస్తూ ఉత్సాహపరిచారు. అనంతరం ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో నూతనంగా నిర్మించిన ఎన్.ఆర్.ఎన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్దకు మంత్రి చేరుకుని, రిబ్బన్ కత్తెరించి ఆధునిక క్రీడా సముదాయాన్ని జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో మంత్రి లోకేష్‌తో పాటు రాష్ట్ర రవాణా, యువజన , క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని , ఆయన కుమారుడు పులివర్తి వినీల్ పాల్గొన్నారు. ఈ వేడుకకు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ దిగ్గజాలు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్టేడియంలోని కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ , ఆర్చరీ అకాడమీలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. క్రీడా ప్రాంగణం అంతా కలియతిరిగి అక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మంత్రికి స్టేడియం విశేషాలను, క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలను వివరించారు. క్రీడాకారులలో ఉత్సాహం నింపేందుకు మంత్రి స్వయంగా హాకీ స్టిక్ పట్టి కొద్దిసేపు క్రీడను ఆస్వాదించారు. అనంతరం వివిధ క్రీడలకు చెందిన అథ్లెట్లతో మంత్రి ముచ్చటించి, వారితో కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. యువత క్రీడల్లో రాణించడానికి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. చంద్రగిరి యువతకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించినందుకు ఎమ్మెల్యేపై మంత్రి లోకేష్ ప్రశంసలు కురిపించారు. రాష్ట్ర యువత క్రీడల్లో విశేష ప్రతిభ కనబరచడానికి అవసరమైన అన్ని వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఈ స్టేడియం పనులు ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం , నిధుల కొరత కారణంగా పనులు గోడల స్థాయిలోనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవ చూపి, నిధులను మంజూరు చేయించడంతో ఈ స్టేడియం పనులు వేగంగా పూర్తయ్యాయి. ఈ స్టేడియానికి దివంగత నారా రామ్మూర్తి నాయుడు జ్ఞాపకార్థం "ఎన్ఆర్ఎన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్" గా నామకరణం చేశారు. అన్ని ఆధునిక క్రీడా సదుపాయాలతో నేటి నుండి ఈ స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి రాగా, క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్పష్టం చేశారు. చంద్రగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు, అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేస్తూ సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ రూపురేఖలు మారుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు రాబోయే రోజుల్లో చంద్రగిరిని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేష్‌తో పాటు రాష్ట్ర రవాణా, యువజన , క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు , చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. ఈ వేడుకకు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ దిగ్గజాలు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ , భారత హాకీ క్రీడాకారిణి రజని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరితో పాటు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీకాంత్, పులివర్తి వినీల్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర ఎమ్మెల్యేలు , మండల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ' ప్రైవేట్ ' విద్యార్థుల హవా

## - సత్తా చాటిన శ్రీ వివేకానంద, శ్రీ చైతన్య, పిఎస్ఎన్ వివేకానంద కళాశాలల విద్యార్థులు








**చిత్తూరు,ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో గతంలో లాగానే చిత్తూరు నగరానికి చెందిన పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థుల హవా కొనసాగింది. బుధవారం ఉదయం విడుదలైన పరీక్షల ఫలితాల్లో స్థానిక శ్రీ వివేకానంద, శ్రీ చైతన్య, పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి చిత్తూరు నగరంలోనే టాపర్లుగా నిలిచారు.

- శ్రీ వివేకానంద కళాశాలలో....

స్థానిక మురుగానిపల్లి కామేశ్వరనగర్ లో వీ.మహేంద్రకుమార్, టీ భాస్కరనాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఏ మహిత్ 467 మార్కులు సాధించి చిత్తూరు నగర టాపర్ గా నిలిచాడు. ఇర్ఫానా 466, ముబాషరీఫ్, జాహ్నవి, జైష్ణవి, పల్లవి 465 మార్కులు, నితీష్, మోహిత, రోహిత్ 464 మార్కులు చొప్పున సాధించి సత్తా చాటారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎస్.బాలాజీ 990 మార్కులు సాధించగా, తైయూరు వీణసాయిశ్రీ, 989, శిరీషారెడ్డి, మౌనిక, బెష్వంత్, మేఘన 988 మార్కుల చొప్పున సాధించి రాణించారు. మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో తాతిరెడ్డి మానస 451 మార్కులు సాధించగా, ఆర్ కుష్బూ 447, లెనిన్, పల్లవి, గాయత్రి 444 మార్కుల సాధించారు. సిఇసి మొదటి సంవత్సరంలో చతుర్య 476 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో ఎంహెచ్ చందు 953 మార్కులతో రాణించారు. వీరిని కళాశాల నిర్వాహకులు మహేంద్ర కుమార్, భాస్కరనాయుడు అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

- శ్రీ చైతన్య కళాశాలలో...

స్థానిక గాంధీ రోడ్డులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో యస్మిత, వర్షిని 991 మార్కుల సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ ఫలితాల్లో ఉదయహాసిని, రుచిత 989, దీప్తి 988, జ్యోషిత 987, సాయి స్రవంతి 986 మార్కులు సాధించారు.

మొదటి సంవత్సరం బైపిసి విభాగంలో యశస్విని, సమ్రీన్ 449 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో కె శ్రావ్య 466 మార్కులు సాధించగా... సంతోష్, అక్షయ 465 మార్కులు చొప్పున, అల్లాభక్ష్, హేమంత్ శశాంక్, అభినయ, ఇందు, వైష్ణవి, గుణ 464 మార్కులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ శివకుమార్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

- పిఎస్ఎన్ వివేకానంద కళాశాలలో....

స్థానిక మురుగానిపల్లెలోని పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాలకు చెందిన ఆర్ భూమికరెడ్డి, రమ్యశ్రీ, ఢిల్లీప్రసన్న, సాత్విక్ 466 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ప్రజ్వల 992, నక్షత్ర 991, రవళిక 990 మార్కులు సాధించి కళాశాలకు మంచి పేరు తెచ్చారు. మొదటి సంవత్సరం బైపిసి భాగంలో ప్రచోధిని అనే విద్యార్థిని 444 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో శ్రీనిధి 977, పౌర్ణమి 963 మార్కులు సాధించడం విశేషం. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ పి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకులు అభినందించారు.

# సచివాలయాల పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్




**పుట్టపర్తి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో గ్రామ వార్డు సచివాలయాల పనితీరుపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓలు, డీడిఓలు , జిల్లా స్థాయి అధికారులు ప్రతిరోజూ తప్పనిసరిగా సచివాలయాలను సందర్శించి, క్షేత్రస్థాయిలో పాలనను పర్యవేక్షించాలి. 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్‌లో పారదర్శకమైన పాలన , ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలను అందించే లక్ష్యంతో, జిల్లాలోని ప్రతి మండల , సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సచివాలయ సిబ్బంది , ప్రభుత్వ ఉద్యోగి ప్రతిరోజూ మనమిత్ర ప్లాట్‌ఫామ్ ద్వారా సేవలను అందించాలన్నారు. ప్రతి ఉద్యోగి రోజుకు కనీసం 5 నుండి గరిష్టంగా 20 వరకు లావాదేవీలు లేదా సేవలను ఈ యాప్ ద్వారా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం ఐటి మేనేజర్ హిమవాణి సంప్రదించి, ఎప్పటికప్పుడు సమస్యలను నివృత్తి చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు వేగంగా, డిజిటల్ రూపంలో అందించడానికి మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ఒక గొప్ప వేదిక అని, దీనిని విజయవంతం చేయడంలో సిబ్బంది అందరూ చురుగ్గా పాల్గొనాలని అధికారులు కోరారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, ఏపీఎస్ సర్వే , మిస్సింగ్ డేటా అప్డేషన్లలో ఎటువంటి జాప్యం ఉండకూడదని, వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని, పంచాయతీ నిధులతో అవసరమైన చోట మరమ్మతులు చేపట్టి, ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సమత, GSWS నోడల్ అధికారి జనార్ధన్ రావు, జిల్లా డివిజనల్ అధికారులు, డిప్యూటీ ఎంపీడీఓలు , సాంకేతిక బృందం పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

## - కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్

**కదిరి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో జరిగిన పేలుడు ఘటనపై శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ ప్రమాదంలో నలుగురు మరణించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.బ్లాస్టింగ్ పదార్థాల వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. గత 10 ఏళ్లుగా రోడ్డు పనులు మరియు వ్యవసాయ పనులకు సంబంధించి బ్లాస్టింగ్, పనులు చేసే వెంకన్న అనే వ్యక్తి ఇంట్లో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అతను ట్రాక్టర్ సహాయంతో బ్లాస్టింగ్ మెటీరియల్‌ను వినియోగిస్తుంటాడు. ఈరోజు ఉదయం అతని ఇంట్లో మంటలు రావడాన్ని గమనించి చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అనంతపురం ఆసుపత్రి సూపర్ ఇంటెండెంట్ , స్థానిక వైద్యులను ఆదేశించడం జరిగింది. క్లూస్ టీమ్ , FSL బృందాలు విచారణ చేస్తున్నాయి. నివేదిక అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

# గ్రంథాలయ అభివృద్ధికి సహకరించండి

## - చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి

**నెల్లూరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగలి వెంకటేశ్వర్లును ఈ రోజు ఆమె చాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిసి, గ్రంథాలయానికి రావాల్సిన సెస్ బకాయిలను విడుదల చేయడానికి సహకరించమని, గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్‌ను నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి కోరారు.

# తిరుపతి జిల్లా

# చిట్టమూరు మండలంలో 2027 జనాభా గణన శిక్షణ ప్రారంభం

**చిట్టమూరు , ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 2027 జనాభా గణన శిక్షణ ప్రారంభమైంది. తహసిల్దార్ రామయ్య, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డిటి నిరంజన్ ఆధ్వర్యంలో గణన అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు. ప్రతి పౌరుడి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా చేరతాయని అధికారులు పేర్కొన్నారు. శిక్షణలో గణన విధానం, డిజిటల్ రికార్డింగ్, డేటా భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. తహసిల్దార్ రామయ్య మాట్లాడుతూ జనాభా గణన దేశ అభివృద్ధికి అద్దం అని అన్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం గణనలో భాగం కావాలని పిలుపునిచ్చారు. డిటి నిరంజన్ సాంకేతికతతో గణన మరింత పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. గణన అధికారులు, పర్యవేక్షకులు శిక్షణలో చురుకుగా పాల్గొని ప్రశ్నలు అడిగారు. ప్రజల సహకారం లేకుండా గణన విజయవంతం కాదని అధికారులు స్పష్టం చేశారు. ప్రతి ఇంటి తలుపు తట్టి, ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేయడం గణన అధికారుల బాధ్యతగా గుర్తు చేశారు. శిక్షణలో గణన పత్రాలు, మొబైల్ యాప్ వినియోగం ప్రదర్శించారు. ప్రజలు నిజమైన వివరాలు ఇవ్వాలని, తప్పుడు సమాచారం ఇవ్వకూడదని విజ్ఞప్తి చేశారు. జనాభా గణన ద్వారా విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతాయని అధికారులు తెలిపారు. చిట్టమూరు మండలంలో ఈ శిక్షణ స్థానిక ప్రజల్లో ఆసక్తి రేకెత్తించింది.

# ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను సన్మానించిన ఆర్యవైశ్య సంఘం నేతలు



**నాయుడుపేట, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తాను తిరుపతి రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చిన ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ను ఆర్యవైశ్య సంఘం తిరుపతి జిల్లా రూరల్ వ్యవస్థాపక అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్, యువజన సంఘం అధ్యక్షులు డమరుక నాథ్ గుప్తా దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు రేఖ గుప్తాకు శాలువాలు కప్పి సన్మానించారు. తిరుపతి రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి నాగరాజు, కార్యదర్శి గంగిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షులు గూడూరు కిరణ్ కుమార్, పలువురు ఆర్యవైశ్య సంఘం సభ్యులు రేఖా గుప్తా కు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

# నిరుపేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లు

## - ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పేదలెవరూ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం అన్నా క్యాంటీ న్లను ప్రతిష్టా త్మకంగా చేపట్టిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను రాష్ట్ర ఆర్ అండ్ బి మంత్రి బి.సి జనార్ధన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, మారిటైం బోర్డు ఛైర్మన్ సత్య గారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ లో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అన్నా క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లోనూ అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇప్పటివరకు 207 క్యాంటీన్లు ఉండగా.. ఇప్పుడు 62 క్యాంటీన్లు సీఎం ప్రారంభించారన్నారు. కొత్త వాటితో కలిపి 269కి చేరిందని వివరించారు. వీటి ద్వారా రాష్ట్రంలో రోజుకు 2.20 లక్షల మంది భోజనాలు చేస్తున్నారని వివరించారు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ ఫలితాలలో సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ జలదంకి విజయ్ బాబు రెడ్డి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందనందించారు. సెకండ్ ఇయర్ ఎంపీసీ విభాగంలో కె.రామకృష్ణారెడ్డి 985 మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. పి.దీక్షిత 979, ఎన్.సాయి 978, కె.గోపికృష్ణ 974, కె.పురుషోత్తం 971 మార్కులు సాధించారన్నారు. సీనియర్ బైపిసి లో జి.లిఖిత ప్రియ 922 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ లో షేక్ షబ్రీన్ , కె శ్రావణి 462 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, షేక్ రిజ్వానా 461 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. జూనియర్ బైపిసి లో జి.హర్షిత్ 440 మార్కులతో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. సీఈసీ లో జి భవిష్య 469 మార్కులు సాధించగా, ఎం.ఇ.సి గ్రూపులో డి.హన్న 445 మార్కులు సాధించిందని తెలియజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరికీ విక్రమ్ జూనియర్ కళాశాల , శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాలల కరస్పాండెంట్ జలదంకి విజయబాబు రెడ్డి నగదు బహుమతులు అందజేశారు.

# ఇంటర్ ఫలితాలలో సాయి విద్యానికేతన్ విద్యార్థుల ప్రభంజనం

**చిల్లకూరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ ఫలితాల్లో చిల్లకూరు సాయి విద్యానికేతన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం M.P.C గ్రూపులో 991 మార్కులతో కె.గాయత్రి రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచిందని వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫలితాలలో M.P.C గ్రూపు లో 464 మార్కులతో టి.శ్రీ సాయి నిఖిల్ గూడూరు లో ముందంజలో నిలిచారన్నారు. ఘన విజయానికి తోడ్పాటును అందించిన విద్యార్థులకు , వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి విద్యాసంస్థల చైర్మన్ బి. వెంకటేశ్వర్లు , కళాశాల ప్రిన్సిపాల్ ఎ. మునిశేఖర్ అభినందనలు తెలియజేశారు.

## జలధార - జలహారతి పనులను వేగంగా పూర్తి చేయాలి

### - పనులను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**చౌడేపల్లి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో 'జలధార - జల హారతి' కార్యక్రమం కింద చేపట్టిన 100 రోజుల పనుల ప్రగతిపై ఎంపీడీవో, మండల వాటర్ రిసోర్స్ పర్సన్ , ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో ఎన్ని చెరువులు ఉన్నాయో, వాటిలో ఎన్ని నీటితో నిండివున్నాయో వివరాలు తెలుసుకున్నారు. మేజర్, మైనర్, సబ్, మైక్రో బేసిన్ స్థాయిలో మిగులు (సర్ప్లస్), లోటు (డెఫిసిట్) ప్రాంతాలను గుర్తించి, కాస్కేడ్ వ్యవస్థలో బేసిన్‌లు, సబ్ బేసిన్‌లు, చెరువులను పరస్పరం అనుసంధానం చేసే విధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీడీవో, వాటర్ రిసోర్స్ అధికారులు, నరేగా, గ్రౌండ్ వాటర్ , ఇతర శాఖల మధ్య సమన్వయం అవసరమని సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ.. జలధార ప్రాజెక్టును శాస్త్రీయ ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. గతంలో కొన్ని చెరువులకు నీటి సరఫరాలో సమస్యలు ఉన్నాయని, ఫీడర్ చానల్స్, డీసిల్టేషన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం అధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తూ, రాబోయే మాన్సూన్ నాటికి పనులు పూర్తి చేసి, ప్రతి నీటి చుక్కను పొదుపు చేస్తూ నీటి భద్రత సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. మండలంలో 243 ఎంఐ ట్యాంకులను ఒక సమగ్ర జలాశయంగా భావించి, టీఎంసీ స్థాయిలో నీటిని నిల్వ చేసే అవకాశాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మండలంలో భూ సమస్యల పరిష్కారంపై తాసిల్దార్ , సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. చౌడేపల్లి మండలంలోని దిగువపల్లి పంచాయతీ శెట్టి కుంట చెరువు , కాగతి పంచాయతీ కాగతి చెరువులను కలెక్టర్ పరిశీలించి, వాటి మధ్య ఉన్న కనెక్టివిటీ సప్లై ఛానల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. చెరువుకు అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న కట్టను తొలగించాలనే రైతుల అభ్యర్థనపై స్పందిస్తూ, విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలమాధవి, తాసిల్దార్ పార్వతి, సిఐ ప్రసాద్, మండల వాటర్ రిసోర్స్ పర్సన్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ ఉద్దేశం

### - పీకేఎం ఉడా చైర్మన్ సురేష్ బాబు



**రామకుప్పం, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పేదవాడికి కూడు నీడ గుడ్డ కల్పించాలన్న సంకల్పంతో ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో పేదవాడి ఆకలి తీర్చడమే సంకల్పంగా ముందుకు వెళుతోందని పీకేయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన రామకుప్పం మండల కేంద్రంలో అన్నా క్యాంటీన్ ను పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంలో ఉన్న ప్రజలు మూడు పూటలా భోజనం చేయాలనే సంకల్పంతో అన్నా క్యాంటీన్‌లను ముఖ్యమంత్రి ప్రారంభిం చారని, కేవలం ఐదు రూపాయలతో కడుపునిండా తినడానికి అన్న క్యాంటీన్లు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి, జిల్లా నేత పత్రా నారాయణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, కామరాజు నాయక్, మాజీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, ఆనంద రెడ్డి, వీకోట మండల అధ్యక్షుడు రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ ,కుప్పం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చలపతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు నరసింహులు,ఎంపీపీ సులోచనగురప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామ్ గౌడ, సీతాపతి ,రామమూర్తి, కుప్పం కనన్, గంటలప్ప గౌడ్, బెంగళూరు రాజన్న, రామకృష్ణప్ప, నందా రెడ్డి, విశ్వనాథ్ ,మహమ్మద్ రఫీ, కృష్ణా నాయక్, కడ రఘు, బాలాజీ నాయక్, రవి రెడ్డి, నాగభూషణం, అవినాష్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, బాలకృష్ణ, వెంకటాచలం, పద్మనాభ రెడ్డి, బద్రి, అల్లి శ్రీను, టీవీ రవి, భాస్కర్, ఆదిల్, బాలు,సుబ్రీ,మండల జనసేన అధ్యక్షుడు హరీష్, బిజెపి నేతలు ఆంజనేయప్ప, రాజా సింహ, జనార్ధన్, పెద్ద ఎత్తున కూటమి సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

## ఇంటర్లో ఉత్తమ ప్రతిభ చూపిన గ్రామీణ విద్యార్థిని జోష్న



**రామకుప్పం , ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని 90 బందార్ల పల్లి పంచాయతీ లింగాపురం గ్రామానికి చెందిన ఏ.జోష్న ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 984 మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. గ్రామీణ ప్రాంతంలో 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివిన జోష్న చదువులో ప్రతిభ చూపేది. గ్రామీణ ప్రాంతంలో చదివి ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించడంతో లింగాపురం గ్రామస్తులు జోష్నా తల్లిదండ్రులు , పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి జోష్నాను అభినందించారు. మండల పరిధిలోని నాలుగు జూనియర్ కళాశాలలో పరిధిలో 162 మంది విద్యార్థి, విద్యార్థినీలు ఇంటర్ పరీక్షలు వ్రాయగా, 150 మంది ఉత్తీర్ణలై మండలం 93 శాతం ఫలితాలను సాధించారని రామకుప్పం మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## ఇంటర్మీడియట్ ఫలితాలలో అద్భుత ఫలితాలు సాధించిన శ్రీ గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు



**కందుకూరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ మొదటి , రెండవ సంవత్సర పరీక్షా ఫలితాలలో శ్రీ గాయత్రి, విద్యా పరిషత్ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగములో 466 మార్కులు సాధించిన పాతూరి శ్రీ లాస్య టౌన్ ఫస్ట్ సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో పోలిశెట్టి వెంకట సాయి లక్ష్మీ జ్యోత్స్నప్రియ, బొల్లా దీపిక 464 మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో షేక్ ఫర్హానా , దర్శనం విక్టర్ చార్లెస్ 463 మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీ విభాగలో కోటా కళ్యాణి , కొనిదన కళ్యాణి. 461 మార్కులు సాధించగా, తోట నాగ ఈసా 459, గూడూరి జానీ శ్రీ 458 , షేక్ సాహిద్ 457, షేక్ అబ్దుల్ బషీద్ 457, అక్కల విష్ణు హర్షిని 450 , షేక్ రియా రిజ్వానా 450 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ బైపీసీ విభాగంలో షేక్ Tahura Naseem 452 మార్కులతో స్టేట్ సెకండ్ , టౌన్ ఫస్ట్ ర్యాంక్ సాధించారని, జూనియర్ బైపీసీ విభాగంలో చెన్నం శెట్టి హరిణి 451 మార్కులు పొంది థర్డ్ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అలాగే పి.అభినయ 425, టి.అలేఖ్య 425, జూనియర్ సీఈసీ విభాగంలో పాలకుర్తి పావని 456 మార్కులు సాధించి కాలేజీ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో పఠాన్ రుహీన సుల్తానా 990 మార్కులతో కాలేజీ ఫస్ట్ సాగించినట్లు, సీనియర్ ఎంపీసీ విభాగంలో నెక్కంటి రాకేష్, చలంచర్ల మోహన శ్రీ 989 మార్కులు సాధించినట్లు, సీనియర్ బైపిసి విభాగంలో సయ్యద్ సన 950 మార్కులతో కాలేజీ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. అద్భుత సాధించిన విద్యార్థులకు శ్రీ గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్.రామకృష్ణారావు డైరెక్టర్ సిహెచ్.భరద్వాజ్, శ్రీ గాయత్రీ విద్యా పరిషత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వి. ఉషా చంద్రిక , శ్రీ గాయత్రీ విద్యా పరిషత్ జూనియర్ కాలేజ్ సింగరాయకొండ ప్రిన్సిపాల్ బాలు , శ్రీ గాయత్రి ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ వెంకటేశ్వర్లు , శ్రీ గాయత్రి విద్యా పరిషత్ జూనియర్ కళాశాల Dean పాతూరి వెంకటేశ్వర్లు , శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలిశెట్టి గీతా శ్రీనివాసరావు విద్యార్థిని, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు , అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

## అంబేద్కర్ ఫోటోలు పంపిణీ

**చెన్నూరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జై భీమ్ మాల మహాసేన అధ్యక్షులు పల్లెకొండు సంపత్ కుమార్, చైతన్య ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 1 నుండి 14 వరకు వారోత్సవాలు నిర్వహించారు చివరగా చెన్నూరు మండలం కనుపర్తి గ్రామంలో ఇంటింటికి అంబేద్కర్ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికి అంబేద్కర్ చిత్ర పటాన్ని అందించి రాజ్యాంగ హక్కులు గురించి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ జై భీమ్ మాల మహాసేన కన్వీనర్ ఉదయ్, శ్యాం సున్, ప్రభుదాస్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల సిబ్బంది మోడల్ బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమం ప్రారంభం




**కుప్పం, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం పురపాలక సంఘం పరిధిలో జనాభా లెక్కల సిబ్బంది మోడల్ బ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైనట్లు కమిషనర్ పి. శ్రీనివాస్ తెలిపారు. జనాభా లెక్కల నిర్వహణలో భాగంగా కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఎంపికైన మోడల్ బ్యాచ్‌కు ఏప్రిల్ 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 34 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. గృహ గణన విధానం, వ్యక్తిగత వివరాల సేకరణ, డేటా నమోదు పద్ధతులు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే విధానాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే విధానం గురించి సూచనలు ఇవ్వబడుతున్నాయి. ప్రభుత్వం సూచించిన అధికారిక వెబ్‌సైట్ ద్వారా సమాచారాన్ని నమోదు చేయాలని తెలియజేశారు. శిక్షణ కార్యక్రమాన్ని జనాభా లెక్కల ట్రైనింగ్ అసిస్టెంట్ పి. సీతిబాబు, హెడ్ మాస్టర్లు, ఇతర సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

## ఎం.ఎల్.సి. డాక్టర్ శ్రీకాంత్‌కు పదవి

**కుప్పం, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ శ్రీకాంత్ కు రాష్ట్ర స్థాయిలో మరో కీలకమైన పదవి వరించింది. కుప్పం నియోజకవర్గ పొలిటికల్ ఇన్ ఛార్జ్‌గా నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్‌గా కుప్పం కడా అభివృద్ధి కమిటీలోను అత్యంత ముఖ్య భూమిక పోషిస్తూ వస్తున్నారు. సిఎం. చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా అదనపు బాధ్యతలను స్వీకరిస్తున్నారు . మొదటి నుండి చంద్రబాబు నాయుడుతో సన్నిహితంగా వుంటున్న శ్రీకాంత్ కుప్పం నియోజకవర్గంలో నిరంతరం ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం ప్రకటించారు.

## ఇంటర్ ఫలితాలలో మధు, శ్రీవాణి జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం



**పలమనేరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్ ఫలితాలలో మధు, శ్రీవాణి విద్యార్థులు పలమనేరు పట్టణంలో మొదటి స్థానాన్ని సాధించి, రాష్ట్రస్థాయిలో మార్కులతో పాటు అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారని కళాశాల చైర్మన్ కే. కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. ఈ ఫలితాలలో ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో కే.సానియా 987, ఎస్.టి.ఆరిఫా 984, ఎస్ రిజ్వాన 983, కే రెడ్డి సుజాత 982, ఆర్ యశ శ్రీ - 981, ఓ,సుమంత్ 975 , బైపిసి గ్రూపులో జి.సమీరా 987, ఎల్ సాజియా 980, ఎం ఈ సి గ్రూపులో జి.కవిత 977, జి కాజల్ 968, సిఇసి గ్రూప్‌లో పీ.ప్రీతి 977, టీఎస్ ఫాతిమా 970 సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూప్ లో ఎస్.బుష్రా అంజు 465, ఎం గాయత్రి 464 , ఏ.సోమిత 460, ఆలీషా 460, ఎం బాలాజీ 450, బైపీసీ గ్రూపులో ఎస్.అల్ఫియా 451, బిఎఫ్ రీదా ఐమాన్ 450, సిఈసి గ్రూప్‌లో ఎస్.రోషిని 491 , టీ ఎస్ ఆక్సాసా 489, ఎస్.మదీహ సుల్తానా 483, ఎం ఇ సి గ్రూపు లో ఎం.మధు వర్షిత 460 సాధించారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థులను వారి తల్లిదండ్రులను ,అధ్యాపక బృందాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సి.పి శ్రీవాణి అభినందించారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీ కృష్ణారెడ్డి సిద్ధార్థ విద్యార్థుల విజయకేతనం


### - విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ ఎన్.కృష్ణారెడ్డి



**మదనపల్లె, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో పట్టణంలోని శ్రీకృష్ణారెడ్డి సిద్ధార్థ, శ్రీపద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు ప్రిన్సిపల్ ఎన్.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఆవరణంలో విద్యార్థులు , తల్లిదండ్రులతో కలిసి విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎస్.విశ్వనాథ్ 466, పి.ప్రభు కుమార్,ఎ ం.వినయ సృతి, కే.కీర్తి, ఎ.చెశ్విత, పి.లక్ష్మీప్రియలు 465 మార్కులతో నిలువగా, 21 మంది కి 460 పైగా మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారన్నారు. బైపిసిలో 455 ఎ.తేజ శ్రీ 450, కె.ఎస్.ఎం సాదిక్ హుస్సేన్ 448, పి.కుబ్ర 448 మార్కులు సాధించగా, ఎంఈసిలో కె.సరిత 493, కె.రెడ్డి వర్షిత 479, ఎం.హర్షిత 465 మార్కులు , ఎంఎసిలో ఎం.నవ్యశ్రీ 473, ఎస్.శేఖర్ రాజు 459 మార్కులతో ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో డి.భరత్ కుమార్ రెడ్డి 984, యు.మధురాణి 983, డి.రుచిత 981, కె.హాసిని 980, ఎస్. ఎం.అప్సాన్ 980, రెడ్డి వాసవి 980 మార్కులు సాధించారన్నారు. బైపిసిలో ఏ.ఎస్.అమీన్ 979, సీఈసీలో పి.ప్రియా 966, ఎంఇసిలో 886 మార్కులతో ఫలితాలు సాధించారని ప్రశంసించారు. ఈ ఏడాది కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమన్నారు . గొప్ప విజయాన్ని అందించిన విద్యార్థులు, కృషి చేసిన అధ్యాపకులు , తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

## చిత్తూరు జిల్లా

## విద్యామంత్రికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వినతి



**పలమనేరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తిరుపతి వచ్చిన సందర్భంగా బుధవారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కలిసి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంభందించి వినతిపత్రం అందించారు. అందులో ప్రధానంగా మూడేళ్ల క్రితం 1998 డి.ఎస్.సి. క్వాలిఫైడ్ లకు మినిమం టైం స్కేల్ విధానంలో కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడం జరిగిందని, ఇందులో సగం మంది 60 సంవత్సరాలు పూర్తి చేసుకొని సర్వీస్ నుంచి వైదొలగారని విన్నవించారు. ప్రస్తుతం వీరు కేవలం 2600 మంది వరకే సర్వీస్ లో ఉన్నారన్నారు. వీరికి 62 సంవత్సరాల సర్వీస్ పెంపు 12 నెలల జీతాలు అందించి ఆదుకోవాలన్నారు. విద్యామంత్రి లోకేష్ స్పందిస్తూ... సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చిత్తూరు జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వేటుకూరి జయప్రకాష్ నాయుడు, ప్రధాన కార్యదర్శి చందనం రామయ్య మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్ పరీక్షా ఫలితాలలో ప్రభంజనం



**పలమనేరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్ మొదటి , రెండవ సంవత్సరం పరీక్షా ఫలితాలలో ప్రభంజనం సృష్టించిన పలమనేరు శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం లో ఎస్. కబసం, ఎంపీసీ 470/461, టీజీ లోహిత ఎంపీసీ 470/456, ఎస్.పూజ సిఇసి 500/474, రెండవ సంవత్సరంలో ఎస్ అప్స అంజుమ్ ఎంపీసీ 1000/982, ఎస్ నూర్ షావలి ఎంపీసీ 1000/942, ఎస్. పస్మీన బైపీసీ 1000/940, మార్కులతో ప్రభంజనం చాటారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి సహకరించిన విద్యార్థులకు, అధ్యాపక బృందానికి కళాశాల కరస్పాండెంట్ జి. శ్రీనివాసులు నాయుడు, అకాడమిక్ డైరెక్టర్ జి. నీరజ్ ప్రసాద్ నాయుడు, కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇంటర్ పరీక్షా ఫలితాలలో మదర్ తెరిసా, మాధవి జూనియర్ కళాశాలల విద్యార్థుల ప్రభంజనం



**పలమనేరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మార్చి నెలలో జరిగిన ఇంటర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలైనాయి. ఈ ఫలితాలలో పలమనేరులోని మదర్ తెరిసా జూనియర్ కళాశాల, మాధవి జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎం.రవీంద్రబాబు తెలిపారు. ఇంటర్ రెండవ సంవత్సరంలో ఎంపీసీలో ఎస్.అసియా 989 మార్కులతో టౌన్ టాపర్సగా నిలిచారు. బైపీసీ గ్రూపులో వహీదా సారా 984 మార్కులు, కే.కీర్తన 983 మార్కులు, ఎం ఇ సి లో టాపర్స్ గా ఎంఆర్ గీత 976 మార్కులు, ఆర్ఎండి హాసిన్ సీఈసీ లో టాపర్స్ గా నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో 466 మార్కులతో కే శ్వేత శ్రీ, ఎం ఎస్ పూజిత టౌన్ టాపర్స్ గా నిలిచారు. బైపీసీలో అస్మాక్ నౌషెన్ 455 మార్కులతో సీఈసీ లో కె. చరణ్ 490 మార్కులతో ఎండి లోకేశ్వరి ఎం ఈ సి లో 492 మార్కులతో టాపర్స్ గా నిలిచారు. ఈ ఫలితాలలో విజయం సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను కరస్పాండెంట్ ఎం రవీంద్రబాబు, చైర్మన్ ఎంఆర్ సునీల్, డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డి అభినందించారు.

## ఇంటర్ ఫలితాల్లో ఎస్.వి. జూనియర్ కళాశాల ప్రభంజనం



**పలమనేరు,ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కళాశాల ప్రారంభించి, స్థాపించిన మొదటి సంవత్సరంలోనే పలమనేరు పట్టణంలో అత్యధిక ఉత్తీర్ణత శాతంతో 400 పైన 63 మంది విద్యార్థులు సాధించటం హర్షనీయమని కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు. వీరిలో సి.ఈ.సి. గ్రూప్ కే.శ్రీ గీత 486/500, ఎం.ఇమ్రాన్ భాష 486/500, ఎంపీసీ.గ్రూప్ పి. జోష్ణ 460/470, డి.భరత్ 451/470 అత్యధిక మార్కులు సాధించారు. వీరిని అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్ ఇంటి. మనోహర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హర్ష, శివ శంకర్, రమణ, కే.సి.రెడ్డి, రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష ఫలితాల్లో శ్రీ జ్ఞానాంబిక కళాశాల విద్యార్థుల ప్రతిభ




**మదనపల్లె, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్ ఫలితాలలో శ్రీ జ్ఞానాంబిక కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్ తెలిపారు. ఎంపీసీ విభాగంలో హర్షవర్ధన్ రెడ్డి 989 మార్కులు సాధించగా, చందన 988, బైపీసీ విభాగంలో ఆసియా 987, సాజియా 980, ఎంఈసి విభాగంలో గాయత్రి 978, సయ్యద్ భాష 974 మార్కులు, సిఈసి విభాగం లో హర్షిత 965, అఫ్రీన్ 953 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగం లో మేఘన 463 మార్కులు, జగదీశ్వర్ నాయుడు 461 మార్కులు, బైపిసి విభాగం లో జోలోపులుతా, ముస్కాణ్ లు 449 మార్కులు, తేజశ్రీ 448 మార్కులు, ఎం ఇ సి విభాగం లో హాసిని 487, శివ కుమార్ 467, సిఈసి విభాగం లో భువన కృతి 490 మార్కులు, రెడ్డి లక్ష్మి 486 మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరస్పాండెంట్, అధ్యాపకులు అభినందించారు.

## రాష్ట్రస్థాయి ర్యాంకులతో ప్రభంజనం సృష్టించిన శ్రీ వెంకట్ రెడ్డి సిద్ధార్థ విద్యార్థులు





**మదనపల్లె, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో పట్టణంలోని శ్రీ వెంకట్ రెడ్డి సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ సీనియర్ విభాగంలో శ్రీజ, సమీన 990, దీక్షిత, రుహీనాజ్, తబసుమ్ 988, సమీర్, హితేష్, అజయ్ కుమార్ 987, మిన్హాజ్, లక్ష్మరెడ్డి, మేఘన, లక్ష్మీ కుమార్ 985 మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో గగన్ సాయి 466, పిజి పవన్, జాస్మిన్, ఆర్ మేఘన, చరణ్య 465 మార్కులు సాధించారు. యశశ్రీ, ఇందు, కీర్తిశ్రీ 464, తనూజ్, యశ్విని, తేజశ్రీ 463, సాదియా తబస్సుమ్, ప్రశాంత్ 462 మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీ విభాగంలో నందకిషోర్, విద్యశ్రీ 967, హలీమా సాధియా, అక్షయ జాహ్నవి 956 మార్కులు సాధించారు. జూనియర్ బైపీసీ విభాగంలో ఊహ 447, ఫరూక్ 439 వర్షిని 438, జశ్వంత్, ఇర్ఫా సమ్రీన్ లు 430 మార్కులు సాధించారు. ఎంఈసీ లో జ్ఞానేశ్వర్ 485, వెంకటేష్ 482 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనపర్చారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, ఏఓ హేమంత్ కుమార్, అద్యాపకులు అభినందించారు. ఇందులో భాగంగా మిట్స్ వర్సిటీ ప్రతినిధులు మారుతి ప్రసాద్ , రియాజ్ అలీ తదితరులు విద్యార్థులను అభినందించి ఘనంగా సత్కరించారు.

## ఇంటర్‌లో సత్తా చాటిన మదనపల్లె జూనియర్ కళాశాల విద్యార్థులు



**మదనపల్లె, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ ఫలితాలలో మదనపల్లె పట్టణానికి చెందిన మదనపల్లె జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చూపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో లోహిత్ రెడ్డి, షణ్ముఖ ప్రియ 463, మాలతి, సిరివెన్నెల 462 మార్కులు సాధించి సత్తా చాటారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో భానుతేజ 988, దీక్షిత 986, గంగోత్రి 985, మౌర్యతేజ 984, ఆయేషా, సిద్దిక్ 981, ఎస్.ఆయేషా 980 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. జూనియర్ బైపిసి విభాగంలో ఎం. దివ్య, బి. ఉదయ్ శంకర్ లు 421 మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీ విభాగంలో అనీషా, షణ్ముఖప్రియ లు 971 మార్కులు సాధించారు. జూనియర్ సిఇసి విభాగంలో షైలాభాను 479, లోకేశ్వరి 447 మార్కులు సాధించారు. సీనియర్ సిఈసి విభాగంలో రెడ్డిభాను 936 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మహేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

## సిఐ నరసింహారాజును సన్మానించిన ధూపంరాజు

**కడప, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని తాలుకా పోలీస్ స్టేషన్ నూతన సి.ఐ.గా బాధ్యతలు చేపట్టిన పి.నరసింహ రాజును బుధవారం 48 డివిజన్‌కు చెందిన బేడ, బుడగ జంగం సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షులు ధూపం రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. సీఐకు పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం కృషి అభినందనీయ మన్నారు. తాలూకా పోలీసు స్టేషన్ నూతన సిఐ గా బాధ్యతలు చేపట్టిన నరసింహ రాజు బడుగు, బలహీన వర్గాలకు రక్షణ ఉండి వారికి న్యాయం చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్ పరిధి లోని బుడగ జంగం కాలనీలో పేద వర్గానికి చెందిన ప్రజలే అధికంగా ఉన్నారని తెలిపారు. యాచక వృత్తి, చిరు వ్యాపారాలు, కూలి పనులు చేసుకుంటూ జీవి స్తున్నారని తెలిపారు. సీఐ కార్యక్రమంలో సురేష్, మహేష్ పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో బాలికల జోరు










**రామసముద్రం, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండలం దిన్నిపల్లి సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అత్యధిక మార్కులు సాధించి అగ్రస్థానాల్లో నిలిచారు. ప్రథమ సంవత్సరంలో ఎల్.మేఘన 500కు 488 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. కె.సౌజన్య 480 మార్కులు, బి.హేమశ్రీ 458 మార్కులు, ఆర్.హారతి 442 మార్కులు సాధించారు. 97 మంది పరీక్షలు వ్రాయగా 80 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో పి.గీత, జ్ఞానశ్రీ ఇద్దరూ 1000కు 957 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. కె.రక్షిత 956 మార్కులతో ద్వితీయ స్థానం, పి.పల్లవి 950 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. 92 మంది పరీక్షలు వ్రాయగా 81 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ద్వితీయ సంవత్సరం ఏ.తులసి 915 మార్కులు సాధించగా, ప్రథమ సంవత్సరం కె.అమృత 456 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో 100 శాతం, ప్రథమ సంవత్సరంలో 96 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ మస్తాన్ బి తెలిపారు.

# ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ విద్యా వికాస్ విజయ దుందుభి

**- హర్షం వ్యక్తం చేసిన ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ శివశంకర్**




**మదనపల్లె, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్మీడియట్ ఫలితాలలో అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలోని శ్రీ విద్యా వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు ఏ.సిరివల్లి 466, కె.త్రివిక్రమ్ 464, డి.శిరీష 463, ఎస్.బాలాజీ 463, టి.సాగర్ 460, ఇ.కీర్తి 459 మార్కులు సాధించారు. 400 పైగా మార్కులు 52 మంది విద్యార్థులు సాధించారు. జూనియర్ బైపిసి విభాగంలో ఎస్.నజ్మా 451, ఎస్.సుఫిన 444, ఇ.మౌనిక 443, ఎస్.సల్మా 438, ఎస్.మరియం 433, దీక్షిత 432, ఎస్.షాఫిన్ తాజ్ 432, జుహ 430 మార్కులు సాధించారు. 20 మంది విద్యార్థులు 400 పైగా మార్కులు సాధించారు. జూనియర్ సిఈసి విభాగంలో ఎస్.రెడ్డి ప్యారి 488, ఎస్.రోషిని 482 , ఎస్.సుఫియా ఫాతిమా ఖానం 482, కె.స్పందన 480, ఎస్.హిమ బిందు 470, సి.మికిలనాథ్ 464, ఎస్.రాకేష్ కుమార్ 458, హెచ్.తేజ శ్రీ 457 మార్కులు సాధించగా, 30 మంది విద్యార్థులు 400 పైగా మార్కులు సాధించి సత్తాచాటారు. సీనియర్ బైపీసీ విభాగంలో ఎస్.జియా అంజుమ్ 974, ఎం.లిఖిత శ్రీ 971, ఎ.తస్మియా 943, పి.మనోహర్ రెడ్డి 940, ఎస్.ప్రీతిక 930, టి.దాకేశ్ రెడ్డి 924 మార్కులు సాధించారు . సీనియర్ ఎంపీసీ విభాగంలో వి.అభిషేక్ 964, ఏ.రేహాన్ 957, ఈ.రెడ్డి శేఖర్ 956, ఈ.లాస్య 951 మార్కులు సాధించారు. సీనియర్ సీఈసీ విభాగంలో ఎస్.హురేరా 933, సి.విష్ణువర్ధన్ రెడ్డి 888, ఎస్.ఎం.డి లుక్మాన్ 874, కె .భార్గవ్ 848 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ఇర్రి శివశంకర్, డైరెక్టర్ సి.రెడ్డెప్ప నాయుడు మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ , ద్వితీయ సంవత్సరంలో సాధారణ విద్యార్థులచే అసాధారణ ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఫస్టియర్ ఎంపిసిలో ఏ.సిరివల్లి 466 , ఎస్.నజ్మా 451 మార్కులతో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడం తమ కళాశాలకే గర్వకారణమన్నారు. పరీక్షకు హాజరైన విద్యార్థులలో 90 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు, సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## స్మగ్లర్ల వేటలో వేగం పెంచాలి : ఎస్పీ



**మదనపల్లె, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశించారు. బుధవారం మదనపల్లె లోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎర్రచందనం కేసుల పురోగతిపై సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కేవలం నిందితులను అరెస్ట్ చేయడం మాత్రమే కాకుండా, వారికి కోర్టులో శిక్ష పడేలా బలమైన సాక్ష్యాధారాలను సేకరించి, చార్జ్ షీట్లను గడువులోపు దాఖలు చేయాలన్నారు. సాక్షుల విచారణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిరంతరం కోర్టు వ్యవహారాలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. గతంలో ఎర్రచందనం కేసుల్లో ఉన్న వారి కదలికలపై నిఘా ఉంచి, పరారీలో ఉన్న ముద్దాయిలు, ముఖ్యంగా విదేశాల్లో ఉన్న వారి కోసం అవసరమైతే రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారిని పట్టుకుని స్మగ్లింగ్ జరిగే ప్రధాన మార్గాలను గుర్తించి, చెక్ పోస్టుల వద్ద నిఘాను కట్టుదిట్టం చేయాలన్నారు. టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్లు, కోర్టు సిబ్బంది, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, డిఎస్పీ బి.పావని, పలువురు సీఐలు, ఎస్ఐలు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

**- ప్రారంభించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**

**- హాజరైన ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం.భోపాల్ రెడ్డి**



**మదనపల్లె, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు – 2026లో భాగంగా రెండవ రోజైన బుధవారం రాష్ట్ర విపత్తు స్పందన , అగ్నిమాపకశాఖ కర్నూల్ జోన్ ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం.భోపాల్ రెడ్డి మదనపల్లె అగ్నిమాపక కేంద్రానికి వచ్చారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, మదనపల్లె డీఎస్పీ బి.పావని, స్థానిక మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినీలు, సిబ్బంది, శ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది అగ్నిమాపక కేంద్రానికి వచ్చారు. వారికి అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక శాఖలో ఉపయోగించే వివిధ రకాల పరికరాల గురించి తెలియజేశారు. అనంతరం ఎస్పీ జెండా ఊపి అగ్నిమాపక అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ మదనపల్లె అగ్నిమాపక కేంద్రం నుండి టౌన్ బ్యాంక్ సర్కిల్,హోప్ స్కూల్, బెంగళూరు బస్టాండ్ వరకు ముందుకు సాగింది. అగ్ని మాపక నివారణ చర్యలు గురించి వివరించే కరపత్రాలను ప్రజలకు పంచి పెడుతూ ముందుకు సాగారు. బెంగళూరు బస్టాండ్ వద్ద అగ్నిమాపక సిబ్బంది నిర్వహించిన అగ్నిమాపక విన్యాసాలను ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రాంతీయ అగ్నిమాపక అధికారి బి.భోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,అగ్ని ప్రమాదాల నివారణ చర్యల గురించి వివరించారు.అన్నమయ్య జిల్లా అగ్నిమాపక అధికారి వి.ఆదినారాయణ మాట్లాడుతూ అగ్ని ప్రమాదం ఏదైనా సంభవించినప్పుడు వెంటనే 101కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రాధికారి జి.శివప్ప,సిబ్బంది పాల్గొన్నారు.

## మెకానికల్ ఇంజనీరింగ్, కోర్ జాబ్స్‌తో ఉద్యోగ అభివృద్ధి



**మదనపల్లె/ కురబలకోట, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం వారు జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం "మెకానన్స్ – 2ఖ26" ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి.దీపక్ సింగ్ , సైంటిస్ట్–D, సెంట్రల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ బెంగళూరు వారు పాల్గొన్నారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ ఎవర్ గ్రీన్ అని, కోర్ జాబ్స్ చేసే వారికి కెరీర్ గ్రోత్ బాగుంటుందని అన్నారు. సి.ఎమ్.టి.ఐ సంస్థలో ఇంజినీరింగ్ విద్యార్థులకు లభించే ఉద్యోగ అవకాశాలపై వివరించారు. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్, టెక్నీషియన్ అప్రెంటిస్, ప్రాజెక్ట్ అసోసియేట్, రీసెర్చ్ ఫెలో వంటి పోస్టుల ద్వారా కెరీర్‌ను ప్రారంభించవచ్చని తెలిపారు. సి యెన్ సి మెషినింగ్, రోబోటిక్స్, ఇండస్ట్రీ 4.0 , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత తయారీ రంగాల్లో ఉన్న అవకాశాలను వివరిస్తూ, విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. గేట్ పరీక్షల ద్వారా నేరుగా నోటిఫికేషన్లకు దరఖాస్తు చేయడం ద్వారా సి.ఎమ్.టి.ఐ సంస్థ లో అవకాశాలు పొందవచ్చని తెలిపారు. అదనంగా ఇంటర్న్‌షిప్‌లు, ఇండస్ట్రియల్ విజిట్స్ , ప్రాజెక్ట్ వర్క్ ద్వారా అనుభవాన్ని పెంపొందించుకోవడం అవసరమని, టెక్నికల్ స్కిల్స్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ , టీమ్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, డీన్–స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ దీపాంకర్ రాయ్, విభాగాధిపతి డాక్టర్ భాస్కరన్, అసిస్టెంట్ డైరెక్టర్–ఇండస్ట్రీ రిలేషన్స్ డాక్టర్ పి.ఎమ్ బాలాజీ , కో ఆర్డినేటర్స్ డాక్టర్ గజేందిరన్, డాక్టర్ ఏ.పృథ్వి దీప్, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## ప్రభుత్వ ఆసుపత్రిలో లోపాలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



**పీలేరు,ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో భద్రతా లోపాలు , పరిపాలనా నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాలమహానాడు, సీపీఐ ,ఏ.ఐ. బి.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యులు నిర్ణీత సమయాలకు విధులకు హాజరుకాకపోవడంతో ఓపీ సేవలు దెబ్బతింటున్నాయని తెలిపారు. రోగులకు సరైన పరీక్షలు చేయకుండా మందులు రాయడం, వైద్యులు అందుబాటులో లేకపోవడం, స్కానింగ్ సదుపాయం లేకపోయినా రోగులను ప్రైవేట్ కేంద్రాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ కింద అనవసరంగా సిజేరియన్ శస్త్రచికిత్సలు పెరుగుతున్నాయని, ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు సరైన సిబ్బంది లేకపోవడం, సెలవులు మంజూరు చేయకపోవడం, అధిక పనిభారం మోపడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. భద్రతా పరంగా నిర్లక్ష్యం కొనసాగుతోందని, గతంలో మద్యం సేవించి విధులు నిర్వహించిన ఘటనలు, ఇటీవల వాహన చోరీ జరిగినప్పటికీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి భద్రతా సంస్థపై , పరిపాలనపై శాఖపరమైన విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నేత తుమ్మల ధరణ్ కుమార్, సిపిఐ నేత వెంకటేస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**- ఎన్ఎస్‌యూఐ హెచ్చరిక**

**పీలేరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మధ్యాహ్నం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించినప్పటికీ, పీలేరు మండలంలోని పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఆదేశాలను అమలు చేయడం లేదని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ ఆరోపించారు. విషయం మండల, జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు వర్గాల విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్నం సెలవులు అమలు అవుతుండగా, ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులు కొనసాగడం విద్యార్థుల మధ్య అసమానతలకు దారితీస్తోందన్నారు. తీసుకునే నిర్ణయాలు అన్ని పాఠశాలలకు సమానంగా అమలు కావాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ఒకే విధమైన నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, ఆదేశాలను ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు

**రాయచోటి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంటర్‌మీడి యట్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థికి వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి , రాయచోటి మాజీ శాసనసభ్యులు శ్రీకాంత్ రెడ్డి అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో సాధించిన ఈ విజయం మీ భవిష్యత్తుకు బలమైన పునాది అన్నారు. ఇంటర్ అనేది విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక మలుపు అని అన్నారు. ఈ దశలో నేర్చుకున్న మంచి విలువలు, అలవాట్లు, జ్ఞానం మీ జీవితాన్ని ఉన్నత స్థానాలవైపు తీసుకెళుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇదే ఉత్సాహంతో ఉన్నత విద్యలో రాణిస్తూ, మీ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులు గర్వపడేలా మీ ప్రతిభను చాటుకోవాలని, సమాజ అభివృద్ధికి తోడ్పడే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఇంటర్ మీడియట్ తదనంతరం వేసే ప్రతి అడుగు, మీ భవిష్యత్తు దిశను నిర్ణయిస్తుందని, మీరు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని, ఇదే మీ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే సమయమని ఆయన ప్రేరణాత్మకంగా పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి జీవిత ప్రయాణం విజయవంతంగా, ఆనందంగా సాగాలని శ్రీకాంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ట్రాఫిక్ సమస్యకు తాత్కాలిక పరిష్కారం

**- నూతన రోడ్డు పనులకు శ్రీకారం**



**పీలేరు, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టారు. ఎల్బీఎస్ రోడ్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రైల్వే గేట్ వద్ద రహదారిని తాత్కాలికంగా మూసివేశారు. దీంతో వాహనాలన్నీ పీలేరు పాత బస్టాండ్ మీదుగా మళ్లించడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కారంగా, పీలేరు సదుం రోడ్డులో కొత్తపేట నుండి రత్నం స్కూల్ వరకు కొత్తగా తాత్కాలిక తారు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బుధవారం ఈ పనులకు పీలేరు శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు ఈ తాత్కాలిక రహదారి ఉపయోగ పడుతుందని చెప్పారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గురుకుల జూనియర్ కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత

**- విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు**



**కంభంవారిపల్లి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా గ్యారంపల్లిలోని గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడి యట్ ఫలితాలు విశేషంగా నిలిచాయి. ద్వితీయ సంవత్సరానికి హాజరైన 118 మంది విద్యార్థు లందరూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులలో 128 మందిలో 123 మంది ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలను సాధించారు. సీనియర్ విభాగంలో ఎం.పి.సి.లో ఎస్.మనోజ్ కుమార్ 988/1000, బై.పి.సి.లో ఎం.కార్తీక్ 985/1000, ఎం.ఇ.సి.లో ఎన్. నరేష్ 957/1000 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జూనియర్ విభాగంలో ఎం.పి.సి.లో సి.రామ్‌చరణ్ తేజా 464/470, బై.పి.సి.లో బి. హేమంత్ కుమార్ 450/455, ఎం.ఇ.సి.లో బి. అశోక్ 492/500 మార్కులతో అత్యధిక స్కోర్లు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రామకృష్ణాంజనేయులు మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల అంకితభావం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు సరైన మార్గదర్శకత్వం, పట్టుదలతో ముందుకు సాగితే అత్యున్నత విజయాలు సాధించగలరని అన్నారు. కళాశాలలో నాణ్యమైన బోధనతో పాటు సమయపాలన, ప్రత్యేక శిక్షణ తరగతులు, పరీక్షలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ వైస్ ప్రిన్సిపాల్ జి.ధనరాజ్, స్టూడెంట్స్ అడ్వైజర్ జి. అన్నపూర్ణతో పాటు అధ్యాపకులు రామకృష్ణయ్య, తనూజా, హరి, మస్తాన్, షకీల్, కొండయ్య, ప్రసాద్, డా. గుప్తా, డా. శివమూర్తి అభినందించారు.

# గండ్రాయి హైస్కూల్లో విద్యార్థులతో పనులు...

## హిందీ టీచర్‌కు షోకాజ్ నోటీసు...



**నందిగామ ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గండ్రాయి హైస్కూల్లో చోటుచేసుకున్న ఘటనపై విద్యా శాఖాధికారులు కఠినంగా స్పందించారు. హిందీ టీచర్ వెంకటేశ్వరరావు ఐదుగురు విద్యార్థులను తన సొంత వ్యవసాయ క్షేత్రంలో ధాన్యం ఆరబోతకు తీసుకెళ్లిన విషయం వెలుగులోకి రావడంతో మంగళవారం ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాల ప్రకారం, సోమవారం ఒంటిపూట పాఠశాల అనంతరం టీచర్ తన సొంత కారులో విద్యార్థులను మంగాపురం తండాలోని తన వ్యవసాయ భూమికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్కడ మండుటెండలో విద్యార్థులతో ధాన్యం ఆరబోయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయం తల్లిదండ్రులు, స్థానికులకు తెలియడంతో ఆగ్రహం వ్యక్తమైంది. విద్యార్థులను చదువు సమయంలో తప్ప ఇతర పనులకు వినియోగించడం నియమాలకు విరుద్ధమని విద్యా శాఖాధికారులు స్పష్టం చేశారు. ఘటనపై విచారణ చేపట్టి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. ప్రాథమికంగా వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనతో విద్యార్థుల భద్రత, హక్కులపై చర్చ మొదలైంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. అధికారులు కూడా విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ, తప్పు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# కంచికచర్ల ఇంటర్ పరీక్షా ఫలితాల భయం...

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం...



**నందిగామ ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కంచికచర్ల మండలం చెవిటికల్లులో విషాదకర ఘటన చోటుచేసుకుంది. జగ్గయ్యపేట గురుకులంలో చదువుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని నేడు విడుదలైన పరీక్షా ఫలితాల్లో రెండు సబ్జెక్టుల్లో తప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో మందలిస్తారనే భయంతో ఆవేదనకు లోనైన ఆమె, ఇంటిలోని గదిలో ఫ్యాన్కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి గది తలుపు తట్టగా స్పందన లేకపోవడంతో తలుపు బలవంతంగా తెరిచి చూడగా, విద్యార్థిని ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఆమెను కిందికి దించి ప్రాణాపాయ స్థితిలో విజయవాడలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన వాతావరణం నెలకొంది. పరీక్షా ఫలితాలపై విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. మార్కులు జీవితంలో శాశ్వతం కాదని, విఫలాలు సహజమని, ధైర్యంగా ముందుకు సాగాలని అధికారులు పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులకు మానసిక ధైర్యం కల్పించడం అవసరమని వారు అన్నారు. ఎలాంటి కష్టాలు వచ్చినా ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలకు పాల్పడకూడదని, సమస్యలను కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు.

# గురుకుల విద్యార్థులకు 'హెల్త్ ప్రొఫైల్'

## : 11 రకాల పరీక్షలు.. ఎయిమ్స్ వైద్యులతో ఉచిత తనిఖీలు!



**విజయవాడ ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రంలోని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా మంగళగిరి ఎయిమ్స్ (ూ××మీూ) వైద్యుల సహకారంతో 11 రకాల కీలక వైద్య పరీక్షలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. తొలుత పైలట్ ప్రాజెక్టుగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నారు. ఈ పరీక్షల్లో భాగంగా గుండె, జన్యు, మెటబాలిక్, రక్త సంబంధిత వ్యాధులతో పాటు పోషకాహార స్థితిని కూడా వైద్యులు అంచనా వేస్తారు. పరీక్షల అనంతరం ప్రతి విద్యార్థికి ప్రత్యేకంగా 'హెల్త్ ప్రొఫైల్' రూపొందించి డేటా బేస్‌లో భద్రపరుస్తారు. గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న రక్తహీనత, జన్యుపరమైన సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి మెరుగైన చికిత్స అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. చిన్న వయసులోనే వ్యాధులను గుర్తించడం ద్వారా విద్యార్థుల మరణాలను అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మోపిదేవిలో 'నేస్తం బడికి రా' కార్యక్రమం




**మోపిదేవిఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** 'నేస్తం బడికి రా' కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు బుధవారం నిర్వహించారు. 'ప్రభుత్వ పాఠశాల ముద్దు– ప్రైవేట్ పాఠశాల వద్దు' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని పి. జయంతి మాట్లాడుతూ. సకల సౌకర్యాల నిధి మన ప్రభుత్వ బడి అన్నారు. 15 నుంచి 22వ తేదీ వరకు విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు, ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 13 వేలు సాయం అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు యూనిఫాంతో పాటు పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తామని వెల్లడించారు. కెమిస్ట్రీ, స్టెమ్, కంప్యూటర్ ల్యాబ్స్ వంటి అధునాతన పరికరాలతో బోధన జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సత్యసాయి జిల్లాలో పేలుడు.. ఐదుగురు మృతి



**కదిరి ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సత్యసాయి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా.. 20 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పేలుడు ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఓ కూలీ ఇంట్లో నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు పేలి గ్యాస్ సిలిండర్లకు మంటలు అంటుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై మంత్రి సత్యకుమార్ ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

'డిటోనేటర్ల పేలుడు వల్లే'.. డిటోనేటర్లు, అమ్మోనియం సల్ఫేట్ వల్లే పేలుడు జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. వెంకన్న, సంపత్ కుటుంబం కొండల్లో డిటోనేటర్లు పేల్చి రాళ్లుగా మార్చి విక్రయిస్తోంది. ఇంట్లో డిటోనేటర్లు, అమ్మోనియం సల్ఫేట్, డీజిల్ నిల్వ ఉంచుకున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదాన్ని పసిగట్టి వెంకన్న, సంపత్ పిల్లలను తీసుకొని బయటకు పరిగెత్తినట్లు తెలుస్తోంది. డిటోనేటర్లు ఒక్కసారిగా పేలడంతో మంటలు ఆర్పేందుకు వెళ్లిన ఐదుగురు స్థానికులు మృతి చెందారు.

# ఐతవరం వద్ద విషాదం...

## కారు–బైకు ఢీకొని వ్యక్తి మృతి...



**నందిగామ ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామ సమీపంలోని ఐతవరం వద్ద విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మద్రాస్ ఫిల్టర్ కాఫీ హోటల్ సమీపంలో కారు, బైకు ఢీకొన్న ఘటనలో కంచికచర్లకు చెందిన లక్ష్మీనారాయణ (50) తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న స్థానికులు స్పందించి గాయపడిన లక్ష్మీనారాయణను తక్షణమే నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు చికిత్స అందించినప్పటికీ, ప్రాణాలు నిలబెట్టలేకపోయారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై స్పష్టత కోసం పోలీసులు విచారణ చేపట్టారు. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం, వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, కారును స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు లక్ష్మీనారాయణ మృతి వార్త తెలిసిన వెంటనే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఆయన అకాల మరణం వారిని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఈ ఘటనతో ప్రాంతంలో శోకసంద్రం నెలకొంది. స్థానికులు రోడ్డు భద్రతపై మరింత జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మోపిదేవి మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన



**మోపిదేవి ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మోపిదేవి మండలంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని పెద్దప్రోలు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న పలు వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ బాలికలకు కల్పిస్తోన్న వసతులపై ఆరా తీశారు. వసతి గృహంలో బాలికలకు కల్పించాల్సిన సదుపాయాలు, భోజనం తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# శిథిలావస్థకు చేరిన వంతెన.. నిధులివ్వండి



**కొడవలూరు ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విడవలూరు మండలం ఉటుకూరు – పొన్నపూడి, పట్టపుపాలెం మధ్య బకింగ్ హాం కెనాల్‌పై ఎనిమిదో కిలోమీటరు వద్ద ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. దాని స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని తన నివాసానికి విచ్చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి ఈ మేరకు ఆమె వినతిపత్రం అందజేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన స్లాబ్ పెచ్చులూడి, పిల్లర్లు బలహీనపడటంతో ఏ క్షణమైనా కుప్పకూలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తీరప్రాంత మత్స్యకారుల రవాణాకు, స్థానిక గ్రామస్థుల అవసరాలకు కీలకమైన ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తున్నారని, పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ. 6.50 కోట్ల అంచనా వ్యయంతో నూతన వంతెన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వేసవి దాహం : మట్టి కుండను కొనేటప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి!



**విజయవాడ ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎండలు మండిపోతున్న వేళ ఫ్రిజ్ నీళ్ల కంటే ఆరోగ్యానికి మేలు చేసే మట్టి కుండ నీటికే జనం మొగ్గు చూపుతున్నారు. అయితే, కుండ కొనేటప్పుడు చేసే చిన్న తప్పుల వల్ల నీళ్లు సరిగ్గా చల్లబడవు. సరైన కుండను ఎంచుకోవడానికి ఈ చిట్కాలు పాటించండి. ముందుగా, కుండను వేలితో తట్టినప్పుడు లోహంలాంటి స్పష్టమైన శబ్దం వస్తేనే అది బాగా కాలినట్లు లెక్క. మొద్దుబారిన శబ్దం వస్తే అది పచ్చిదని, త్వరగా పగిలిపోతుందని గుర్తించాలి. అలాగే, రంగులు పూసిన కుండల కంటే సహజ సిద్ధమైన మట్టి రంగులో ఉన్నవే ఉత్తమం. రంగు లేదా పాలిష్ వల్ల కుండపై ఉండే సూక్ష్మ రంధ్రాలు మూసుకుపోయి, నీళ్లు చల్లబడవు. కాబట్టి, సహజమైన కుండను ఎంచుకుని వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

# విజయవాడలో 'మిస్ట్' తుంపర్లు

## : వాయు కాలుష్యానికి చెక్.. వేసవిలో వాహనదారులకు ఊరట!




**విజయవాడ ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు కాలుష్య నియంత్రణ మండలి (ూజదీ) నడుం బిగించింది. గాలి నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో అత్యధునిక మిస్ట్ స్ప్రేయింగ్ (వీఅర్ ూజూతీఖఎఅఅస్త్ర) మెషీన్లను రంగంలోకి దించింది. ఒక్కోటి సుమారు రూ. 30 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఆరు సీఎన్జీ వాహనాలు ప్రస్తుతం నగర ప్రధాన రహదారులపై పరుగులు తీస్తున్నాయి. ఈ వాహనాలు గాలిలోకి నీటి తుంపర్లను వెదజల్లుతూ దుమ్ము, ధూళి కణాలను అణిచివేస్తున్నాయి. రహదారి పక్కన ఉన్న మొక్కలపై పేరుకుపోయిన ధూళిని తొలగించడమే కాకుండా, మండుతున్న ఎండల్లో ద్విచక్ర వాహనదారులకు ఈ చల్లని తుంపర్లు ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. ఈ చర్యల పట్ల నగరవాసుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

# జగన్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కొల్లు రవీంద్ర.




**మచిలీపట్నం ఏప్రిల్ 15( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మంత్రి కొల్లు రవీంద్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై సంచలన వ్యాఖ్యలు చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో బుధవారం పర్యటించిన రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తో కలిసి పరిశీలించిన మంత్రి, మీడియాతో మాట్లాడారు. గత ఐదు సంవత్సరాల పరిపాలనలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని ఆయన ఆరోపించారు. పెట్టుబడిదారుల్లో నమ్మకం,ఆత్మస్థైర్యం కలిగించేందుకు ప్రభుత్వం చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా ఇప్పుడు రాజధాని చట్టంపై ప్రశ్నించడం తగదని విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే చట్టాన్ని మార్చేస్తా అన్న వ్యాఖ్యలు పెట్టుబడిదారుల్లో అనిశ్చితిని కలిగిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కొనసాగుతాయని, పెట్టుబడిదారులకు పూర్తి భరోసా కల్పిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. అంతేకాకుండా, జగన్ మోహన్ రెడ్డి తిరిగి అధికారంలోకి రావడం ఆయన కల మాత్రమేనని వ్యాఖ్యానించారు.

# ఇంటర్ ఫలితాల్లో చినగంజాం విద్యార్థుల ప్రతిభ




**చినగంజాం:** ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో చినగంజాం మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. సోపిరాల గ్రామానికి చెందిన తుమ్మలపెంట శ్రీ విష్ణు ప్రియ సెకండ్ ఇయర్ ఎంపీసీలో 989 మార్కులు సాధించింది. పులవారిపాలెంకు చెందిన తుమ్మలపెంట సాయిలక్ష్మి ఎంపీసీలో 976 మార్కులు, చినగంజాంకు చెందిన మానం మౌనిక బాయి ఎంపీసీలో 975 మార్కులు సాధించారు. ఈ ముగ్గురు వేటపాలెం బీబీహెచ్ జూనియర్ కళాశాల విద్యార్థినులు. అదేవిధంగా సెకండ్ ఇయర్‌లో సోపిరాలకు చెందిన చెరుకూరి సంజన ఎంపీసీలో970 మార్కులు, పెండ్లి వెంకట సాయి దీక్షిత ఎంపీసీలో934 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్ బైపీసీలో సోపిరాలకు చెందిన గంటా హేమన్య 461 మార్కులు సాధించారు. వీరిని గ్రామస్థులు అభినందించారు.

# ఓజీ-2 పనిలో సుజీత్?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చాక, ఆయన చేసిన చిత్రాల్లో అభిమానులను అత్యంత అలరించింది ఓజీనే. సినిమా అనౌన్స్ అయిన దగ్గర్నుంచే బంపర్ క్రేజ్ తెచ్చుకున్న ఈ సినిమా.. తర్వాత ప్రతి ప్రోమోతో ఆకట్టుకుంది. గత ఏడాది సెప్టెంబరులో భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా.. పవన్ కెరీర్లోనే హైయెస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. అభిమానులు సినిమా నుంచి ఇంకా ఎక్కువే ఆశించారు కానీ.. పవన్ చేసిన మిగతా చిత్రాలతో పోలిస్తే ఇది సూపర్ అనడంలో మరో మాట లేదు. ప్రస్తుతం పవన్ సురేందర్ రెడ్డితో సినిమాను ఓకే చేయగా.. దాని కంటే ఓజీ సీక్వెల్ మీదే వారికి ఎక్కువ ఆశలు, అంచనాలు ఉన్నాయి. ఓజీ-2 విషయంలో ఇటు సుజీత్, అటు పవన్ ఇద్దరూ ఆసక్తితోనే ఉన్నారు కానీ.. అది ఎప్పుడు ఉంటుందనే విషయంలో ఏ క్లారిటీ లేదు. ఐతే ఇటీవల దీని గురించి జోరుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఓజీకి సీక్వెల్ కాకుండా ప్రీక్వెల్ చేయాలని సుజీత్ అనుకుంటున్నాడని.. ఆ దిశగా చర్చలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. పీపుల్ మీడియా సంస్థ, పవన్ సొంత ప్రొడక్షన్ హౌస్ పీకే క్రియేటివ్ వర్క్స్ కలిసి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తాయని తెలుస్తోంది. ఐతే ఈ సినిమా ఎప్పుడు ఉంటుందనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ఓజీ తర్వాత సుజీత్.. నానితో బ్లడీ రోమియో సినిమాను అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఈపాటికే మొదలు కావాల్సింది. కానీ ప్యారడైజ్ సినిమా అనుకున్న దాని కంటే ఆలస్యం అవుతుండడంతో నాని ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సమ్మర్ షూటింగ్ అంచనాతో బ్లడీ రోమియో స్క్రిప్టును సుజీత్ ఇప్పటికే పూర్తి చేశాడు. ప్రస్తుతం అతను ఖాళీగా ఉన్నాడు. ఈ సమయాన్ని ఓజీ-2 కోసం వెచ్చిస్తున్నాడట సుజీత్. అభిమానుల అంచనాలను అందుకునేలా ఈ స్క్రిప్టును తీర్చిదిద్దే ప్రయత్నంలో అతను ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి కథ ఎక్కువగా జపాన్ నేపథ్యంలోనే నడుస్తుందని.. సినిమాలో మిస్ అయిన టైం లైన్‌ను ఇందులో చూపిస్తారని అంటున్నారు. సురేందర్ రెడ్డి చిత్రాన్ని పూర్తి చేశాక వచ్చే ఏడాది ఈ సినిమాను పవన్ మొదలుపెట్టే అవకాశముంది.

# దురంధర్ పోవాలని కోరుకున్న టాప్ డైరెక్టర్లు



ఒక భాష నుంచి ఆల్ టైమ్ హిట్ వస్తే.. ఆ ఇండస్ట్రీ అందుకు ఎంతో గర్విస్తుంది. ఆ సినిమా మాది అని గర్వంగా చెప్పుకుంటుంది. 'బాహుబలి' పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ టాలీవుడ్ అలాగే గర్వించింది. 'కేజీఎఫ్' సినిమా సంచలనం రేపినపుడు శాండిల్‌వుడ్ కూడా అంతే ప్రౌడ్ ఫీలైంది. కానీ 'దురంధర్', 'దురంధర్-2' చిత్రాల విషయంలో మాత్రం బాలీవుడ్‌లో అలాంటి ఫీలింగ్ కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. నాలుగు నెలల ముందు 'దురంధర్' ఎంతటి సంచలనం రేపిందో తెలిసిందే. గత నెలలో విడుదలైన 'దురంధర్-2' అంతకుమించి విజయం సాధించింది. తాజాగా ఈ చిత్రం బాహుబలి, పుష్ప-2 చిత్రాలను అధిగమించి ఆల్ టైం ఇండియన్ టాప్-2 గ్రాసర్‌గా నిలిచింది. అయినా బాలీవుడ్ నుంచి ఆ చిత్రాన్ని అభినందిస్తూ బాలీవుడ్ ప్రముఖులు పోస్టులు పెట్టట్లేదు. ఇది కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న మోడీ సర్కారుకు అనుకూలంగా తీశారు అనే ఒక ముద్ర వేసి బాలీవుడ్ ఆ సినిమాకు దూరంగా జరుగుతోందనే అభిప్రాయం కలుగుతోంది. ఇలాంటి సమయంలో బాలీవుడ్ ప్రముఖ దర్శకుల్లో ఒకరైన కునాల్ కోహ్లి.. 'దురంధర్' విషయంలో బాలీవుడ్ అగ్ర దర్శకుల కడుపు మంట ఎలా ఉందో బయటపెట్టారు. 'దురంధర్', 'దురంధర్-2' సినిమాలు సాధించిన విజయానికి గర్వించకపోగా.. ఆ సినిమా ఫ్లాప్ కావాలని బాలీవుడ్ టాప్ డైరెక్టర్లు కోరుకున్నట్లు ఆమిర్ ఖాన్‌తో 'ఫనా' సినిమా తీసిన కునాల్ వెల్లడించాడు. ఇండస్ట్రీలో ఎవ్వరూ 'దురంధర్' సినిమాకు మద్దతుగా నిలవలేదని.. అయినా ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయిందని వ్యాఖ్యానించాడు కునాల్. తాను కొంతమంది అగ్ర దర్శకులతో మాట్లాడానని.. వాళ్లు సోమవారానికి ఈ సినిమా పనైపోతుందని అన్నారని, కానీ ఆ సినిమా సోమవారం పడిపోకుండా బాగా ఆడిందని అన్నాడు. సన్నీ డియోల్ సినిమా 'బోర్డర్-2' సినిమా కూడా ఫ్లాప్ కావాలని చాలామంది కోరుకున్నారని.. కానీ ఆ చిత్రం రూ.300 కోట్ల వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్ అయిందని చెప్పాడు. దీన్ని బట్టి తాను చెప్పదలుచుకున్నది ఒక్కటే అని.. ఇండస్ట్రీ సపోర్ట్ చేసినా చేయకపోయినా పెద్ద విషయం కాదని.. సినిమాలు ఆడతాయని అతనన్నాడు.




## నమ్మొచ్చా... టైటిల్ కోసం 112 కోట్లు



ఇటీవలే విడుదలైన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ తమిళంలో ఓ మోస్తరుగా, తెలుగులో నీరసంగా రన్ అవుతోంది. ఫైనల్ గా ప్రదీప్ రంగనాథన్ ఖాతాలో తొలి ఫ్లాప్ నమోదు కావడం ఖాయమని బయ్యర్లు చెబుతున్నారు. వరసగా మూడు వంద కోట్ల గ్రాసర్లు ఇచ్చి మరోసారి ఆ ఫీట్ చేస్తాడనుకుంటే ఆ ఛాన్స్ మిస్ కావడంతో ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. అయితే పోస్ట్ ప్రమోషన్ల కోసం దర్శకుడు విగ్నేష్ శివం చెబుతున్న మాటలు కొన్ని ఆశ్చర్యకరంగా, షాక్ ఇచ్చేలా ఉన్నాయి. ఈ సినిమా ముందు రాజ్ కమల్ బ్యానర్ మీద కమల్ హాసన్ నిర్మించేందుకు రెడీ అయ్యారు. కానీ పది నెలలు ప్రాజెక్టులో ఎలాంటి కదలిక లేదు. తర్వాత సెవెన్ స్క్రీన్స్ సంస్థ ముందుకొచ్చింది. తొలుత రెండు వందల కోట్ల బడ్జెట్ అనుకున్నారు. పరిస్థితులకు అనుగుణంగా క్రమంగా దాన్ని తగ్గించుకుంటూ వచ్చి వంద కోట్లలోపే పూర్తి చేశారు. ఓటిటి మార్కెట్ హఠాత్తుగా పడిపోవడంతో నిర్మాతకు ఫైనాన్స్ తేవడం కూడా ఒకదశలో కష్టమైపోయింది. విగ్నేష్ భార్య నయనతార డబ్బు సర్దుబాటు చేసింది. ఇక టైటిల్ గురించి చెబుతూ ముందు ఎల్ఐసీ అని పెడదామనుకుని అనుమతి అడిగితే వాళ్ళు ఏకంగా 112 కోట్లు డిమాండ్ చేయడంతో వెనక్కు తగ్గి ఎల్ఐకె ఆప్షన్ ఎంచుకున్నానని అన్నారు. అంత డబ్బు లేకపోవడంతో నిర్ణయం మార్చుకోవాల్సి వచ్చిందని క్లారిటీ ఇచ్చారు. అయితే ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఇలా ఒక సినిమాకు తమ పేరు పెట్టుకోవడానికి అంత డిమాండ్ చేసిందానేది అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న. దీనికి సంబంధించి ఏదైనా క్లారిటీ వస్తే బెటర్. ఇదంతా ఎలా ఉన్నా లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అయిదు రోజులకు గాను సుమారు నలభై కోట్ల దాకా వసూలు చేసి డీసెంట్ అనిపించుకుంది. అది కూడా ప్రదీప్ రంగనాథన్ ఇమేజ్ వల్ల తప్పించి మరొకటి కాదు. విగ్నేష్ శివన్ దర్శకత్వం మీద నెగటివ్ కామెంట్స్ ఎక్కువగా వచ్చాయి. 2040 బ్యాక్ డ్రాప్ తో ఇంత సాగదీసిన టెక్నికల్ లవ్ స్టోరీ ఎందుకు చెప్పాడని విమర్శకులు తలంటారు. తెలుగు వర్షన్ మాత్రం అనుకున్న దానికన్నా త్వరగా వాషౌట్ అయిపోయేలా ఉంది.

# ఎన్టీఆర్ సినిమా కోసం ధనుష్ మూవీ త్యాగం






సప్తసాగరాలు దాటి' అనే చిన్న సినిమాతో రుక్మిణి వసంత్ అనే కన్నడ అమ్మాయి ఎంత మంచి పేరు సంపాదించిందో తెలిసిందే. ఆ సినిమాలో తన అందం, అభినయానికి అందరూ ఫిదా అయిపోయారు. అందులో ఆమె చేసింది గ్లామర్ రోల్ ఏమీ కాదు. కానీ చూడముచ్చటగా కనిపిస్తూ, చక్కటి అభినయాన్ని ప్రదర్శించడంతో ఆమెకు పెద్ద ఎత్తున అభిమానులు తయారయ్యారు. ఈ గుర్తింపు వివిధ భాషల్లో వరుసగా సినిమా అవకాశాలు అందుకుంది రుక్మిణి. ప్రస్తుతం సౌత్ ఇండియన్ బిగ్గెస్ట్ స్టార్ హీరోయిన్లలో ఆమె ఒకరు. తన కెరీర్లోనే బిగ్గెస్ట్ మూవీని ప్రస్తుతం తెలుగులోనే చేస్తోంది రుక్మిణి. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ రూపొందిస్తున్న ఆ చిత్రమే.. డ్రాగన్. ముందు అనుకున్న ప్రకారమైతే ఈపాటికి ఈ సినిమా షూట్ పూర్తి అయిపోయుండాలి. జూన్‌లో రిలీజ్ అని కూడా అన్నారు. కానీ పెద్ద సినిమాల చిత్రీకరణ ఆలస్యం కావడం, రిలీజ్ వాయిదా పడడం అన్నది ఇప్పుడు చాలా కామన్ వ్యవహారం. 'డ్రాగన్' కూడా అందుకు మినహాయింపు కాలేకపోయింది. షూట్ ఇంకా చాలా రోజులే బాకీ ఉన్నట్లు తెలుస్తోంది. తారక్ సహా ఈ సినిమాలో భాగమైన ఆర్టిస్టులందరూ ఇందులో స్టక్ అయిపోయారు. రుక్మిణి ఈ చిత్రం కోసం ఇంకో క్రేజీ ప్రాజెక్టును వదులుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. తమిళంలో ధనుష్ హీరోగా 'లబ్బర్ పందు' డైరెక్టర్ తమిళరసన్ ఓ సినిమా రూపొందిస్తున్నాడు. ఈ చిత్రానికి ముందు రుక్మిణినే కథానాయికగా అనుకున్నారు. కానీ ఆమె నటిస్తున్న 'డ్రాగన్' అనుకున్న సమయానికి పూర్తి కాలేదు. దాని కోసం అదనంగా బల్క్ డేట్లు ఇవ్వాల్సి వస్తోంది. దీంతో ధనుష్ సినిమాను ఆమె వదులుకోవాల్సి వచ్చింది. రుక్మిణి స్థానంలో 'దురంధర్'తో సెన్సేషన్ అయిన సారా అర్జున్‌ను తీసుకుంటున్నారట. సారా.. బాలనటిగా తమిళంలో చాలా సినిమాలు చేసింది. ఇప్పుడు కథానాయికగా ఆమెకు తమిళంలో ధనుష్ చిత్రమే మొదటిది కాబోతోంది. ఆమె తెలుగులో ఇప్పటికే 'యుఫోరియా' సినిమా చేసిన సంగతి తెలిసిందే.



# బిజినెస్ న్యూస్



# ట్రంప్ ప్రకటనతో బుల్ జోరు.. రూ.10లక్షల కోట్లు పెరిగిన సంపద



దేశీయ మార్కెట్లు బుధవారం భారీ లాభాల్లో ముగిశాయి పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లోనే అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి శాంతి చర్చలు జరగొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటన మార్కెట్లలో జోష్ నింపింది. దీంతో సూచీలు నేడు భారీగా లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.10 లక్షల కోట్ల మేర పెరిగింది. ఉదయం 77,981 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ (క్రితం ముగింపు 76,847) ఒక దశలో 78,270కి పెరిగింది. చివరకు 1263 పాయింట్ల లాభంతో 78,111 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 388 పాయింట్లు లాభపడి, 24,231 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.37గా ఉంది. నిఫ్టీ సూచీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎటర్నల్, మ్యాక్స్ హెల్త్‌కేర్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. తమ బలగాలు హార్ముజ్‌ను దిగ్బంధించడంతో ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు నిలిచిపోయినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే యుద్ధం ముగింపు దశకు చేరుకుందని, ఇరాన్‌తో చర్చలు ఉంటాయని ట్రంప్ ప్రకటించారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ఉన్నాయి. ఇక, చమురు ధరలు కూడా కాస్త దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 95 డాలర్లుగా ఉంది. ఇవన్నీ నేటి ట్రేడింగ్‌లో మదుపర్లకు లాభాలను తెచ్చిపెట్టాయి.

# రేపటి నుంచి ఈ బ్యాంక్ అకౌంట్లు క్లోజ్!

దేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB) కీలక నిర్ణయం తీసుకుంది. నిరుపయోగంగా ఉన్న లక్షలాది ఖాతాలను రేపటి (ఏప్రిల్ 16) నుండి శాశ్వతంగా మూసివేయాలని బ్యాంక్ యాజమాన్యం నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఇతర ప్రభుత్వ బ్యాంకుల బాటలోనే పీఎన్‌బీ కూడా ఈ కఠిన చర్యలకు ఉపక్రమించడం బ్యాంకింగ్ రంగంలో చర్చనీయాంశంగా మారింది.

**ఎవరి ఖాతాలు మూతపడతాయి?**

మీడియా నివేదికల ప్రకారం.. ఈ కింది కేటగిరీల కిందకు వచ్చే ఖాతాలను బ్యాంక్ మూసివేయనుంది.

మూడేళ్లుగా లావాదేవీలు లేనివి: గత మూడేళ్లుగా కనీసం ఒక్కసారి కూడా వాడని ఖాతాలు.

జీరో బ్యాలెన్స్: ఖాతాలో జీరో బ్యాలెన్సు ఉండి, చాలా కాలంగా ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ఖాతాలు.

కేవైసీ అప్‌డేట్ లేనివి: గడువులోపు వ-ఖ్జ (ఈ-కేవైసీ) పూర్తి చేయని ఖాతాలపై బ్యాంక్ వేటు వేసే అవకాశం ఉంది.

**ఎందుకీ కఠిన నిర్ణయం?**

బ్యాంకులో వేల సంఖ్యలో నిరుపయోగంగా పడి ఉన్న ఖాతాల వల్ల మోసాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని బ్యాంక్ భావిస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా, అలాగే బ్యాంక్ డేటాను ప్రక్షాళన చేసే ఉద్దేశంతో క్రమానుగతంగా ఇటువంటి చర్యలు చేపడుతుంటారు.

**ఖాతాను కాపాడుకోవాలంటే..**



మీ ఖాతా క్లోజ్ కాకుండా ఉండాలంటే వెంటనే ఈ కింది పనులు పూర్తి చేయండి:

మీ సమీపంలోని పీఎన్‌బీ బ్రాంచ్‌కు వెళ్లి వెంటనే ఇ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయండి.

మీ అకౌంట్‌లో కొంత మొత్తాన్ని జమ చేయండి.

కనీసం ఒక చిన్న లావాదేవీ (డ్రా చేయడం లేదా జమ చేయడం) చేయడం ద్వారా అకౌంట్ యాక్టివ్‌గా ఉందని నిర్ధారించుకోండి.

**తీసుకెళ్లాల్సిన పత్రాలు**

ఈ పనుల నిమిత్తం బ్యాంకుకు వెళ్లేటప్పుడు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, విద్యుత్ లేదా నీటి బిల్లు (అడ్రస్ ప్రూఫ్ కోసం), బ్యాంక్ పాస్‌బుక్ ఒరిజినల్ పత్రాలతో పాటు వాటి ఫోటోకాపీలను (జిరాక్స్) వెంట తీసుకెళ్లడం మర్చిపోకండి

# భారత్-అమెరికా మధ్య మళ్లీ వాణిజ్య చర్చలు..



భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు మళ్లీ మొదలుకానున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం భారత అధికార ప్రతినిధి బృందం వచ్చేవారం అగ్రరాజ్యానికి వెళ్లనున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికార వర్గాలు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా- భారత్ మధ్య ఇప్పటికే తాత్కాలిక వాణిజ్యఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. తాజా చర్చల్లో ఈ ఒప్పందంపై ఇరుదేశాలు ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయనున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి. నిజానికి ఈ ఒప్పందంపై మార్చిలోనే సంతకాలు చేయాలని గతంలో ఇరుదేశాలు అనుకున్నాయి. అయితే, అధ్యక్షుడు ట్రంప్ పలు దేశాలపై విధించిన టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు నేపథ్యంలో ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు నిలిచిపోయాయి. తాజాగా వీటిని పునరుద్ధరించేందుకు ఇరుదేశాలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జులై ఆరంభం నుంచి టారిఫ్‌లను పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ (్రాషెశ్ దీవంంవత్) తెలిపారు. ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధమంటూ తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ తాము తగ్గమని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం సెక్షన్ 301 ఉపయోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ చట్టం కింద విధించే సుంకాలకు ఇప్పటికే న్యాయపరమైన గుర్తింపు ఉందన్నారు.

# రోజంతా బ్యాటరీ వస్తుందని వివో చెబుతోంది

## మరి దీని ప్రత్యేకతలు, ధర, ఇతర వివరాలు మీకోసం..

వివో T5 ప్రో ప్రత్యేకతలు

6.83 అంగుళాల 1.5ఖ అమోలెడ్ డిస్‌ప్లే, HDR 10+ సపోర్ట్

144ఎఓ రిఫ్రెష్ రేట్, 5,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్

క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7ం Gen 4 ప్రాసెసర్

8జీబీ/ 12జీబీ (LPDDR4X) ర్యామ్

128జీబీ/ 256జీబీ (ఖఫీూ 3.1) స్టోరేజ్

50ఎంపీ మెయిన్ కెమెరా (సోనీ IMX882)

2 ఎంపీ డెప్త్ సెన్సార్

ముందువైపు 32ఎంపీ సెల్ఫీ కెమెరా

ఐపీ68ం, ఐపీ69ం రేటింగ్

9,020పొూష్ట్ర సిలికాన్ యానోడ్ టెక్నాలజీ బ్యాటరీ

7000 ఎఎ2 వీసీ కూలింగ్ సిస్టమ్

ఇండిపెండెంట్ గేమింగ్ యాంటీనా

90ఔ ఫ్లాష్ వైర్డ్ ఛార్జింగ్




50శాతం ఛార్జింగ్ 37 నిమిషాల్లోనే

ఎస్‌జీఎస్‌లో బ్లూ లైట్ సర్టిఫికేషన్

ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆరిజన్ ఓఎస్

3 ఏళ్ల ఓఎస్ అప్‌డేట్స్, ఐదేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్

వేరియంట్స్.. ధర.. ఆఫర్లు ఇవే..

వివో T5 ప్రో మూడు వేరియంట్లలో లభ్యం కానుంది. 8+దీ ం128+దీ వేరియంట్ ధర రూ.29, 999.. 8GB+ 256GB 33,999.. 12J;+256J; ధర రూ.39, 999గా కంపెనీ నిర్ణ యించింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు వినియోగ దారులకు రూ.3 వేల వరకు డిస్కౌంట్ లభిస్తుంది. లేదా ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.3 వేలు వరకూ రాయితీ పొందవచ్చు. ఆరు నెలల వడ్డీ రహిత వాయిదాల్లోనూ దీని కొనుగోలుకు అవకాశం ఉంది. ఏప్రిల్ 21 నుంచి ఫ్లిప్‌కార్ట్, వివో వెబ్‌సైట్‌ల వేదికగా ఈ ఫోన్ అందుబాటులోకి రానుంది.

## ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఢిల్లీ ముఖ్యమంత్రి



**తిరుమల, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఢిల్లీ ముఖ్యమంత్రి శ్రీమతి రేఖా గుప్తా బుధవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం అనంతరం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి ఆమెకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును వివరించారు. భక్తుల రద్దీని సమర్థవంతంగా పర్యవేక్షించడానికి ఉపయోగిస్తున్న ప్రెడిక్టివ్ అనలిటిక్స్ విధానాన్ని వివరించారు. అలాగే లడ్డూ ప్రసాదం తయారీ, ట్రాఫిక్ నిర్వహణ, వసతి సదుపాయాల సమన్వయం వంటి అంశాల్లో ఈ సెంటర్ పనితీరును కూడా వివరించారు. భక్తుల భద్రతకు టీటీడీ చేస్తున్న కృషిని ఢిల్లీ ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష

**తిరుపతి,ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 22 ఏ, భూపరిపాలనకు రీసర్వే, పట్టాదారు పాస్ బుక్, డిజిటల్ రెవిన్యూ రికార్డ్స్, జలధార – జలహారతి తదితర అంశాలపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ బుధవారం వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి నుంచి కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫెరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు. తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్ డి ఓ రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్. అనురాధ, ల్యాండ్ అండ్ సర్వే అధికారి అరుణ్ కుమార్, ఇరిగేషన్ ఎస్.ఈ రాధాకృష్ణ, సెక్షన్ సూపరింటెండెంట్స్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీఈఈ సస్పెన్షన్

**తిరుపతి,ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని శ్రీసత్యసాయి సర్కిల్, మడకశిర సబ్–డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. రఘును విధుల నుంచి తొలగిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అవినీతి ఆరోపణలు, విద్యుత్ పరికరాల దుర్వినియోగం, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల రవాణాకు డిపార్ట్‌మెంటల్ వ్యాన్‌ను ఉపయోగించక పోవడం, రైతులతో దురుసుగా ప్రవర్తించడం, ఎస్‌ఎపిలో 262 వ్యవసాయ సర్వీసు దరఖాస్తులను ఉద్దేశపూర్వకంగా తొలగించడం, వివిధ ప్రదేశాల్లో విద్యుత్ లైన్లను అంచనాల అనుమతి లేకుండా మార్చడం, తదితర అంశాలపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

## వరలక్ష్మమ్మ మృతికి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నివాళి

**చంద్రగిరి,ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి మండలం పనపాకంకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డిల్లీశ్వర్ యాదవ్ తల్లి వరలక్ష్మమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. హర్షిత్ రెడ్డితో పాటు మండల పార్టీ అధ్యక్షులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, నాయకులు చెంగల్రాయులు, కుప్పి రెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి ఉన్నారు.

## తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శైలకుమారి

**సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల నూతన తహశీల్దార్‌గా శైలకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దొరవారిసత్రం తహశీల్దార్‌గా పనిచేసిన ఆమెకు ఈ ప్రాంత పరిపాలనపై అవగాహన, అనుభవం ఉండడం గమనార్హం. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆమె మాట్లాడుతూ మండలాభివృద్ధికి, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ భూముల రక్షణ పట్టణ , గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు పెరగడంపై రెవెన్యూ శాఖపై ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీటిని అరికట్టడం ఇప్పుడు కీలకంగా మారింది. నూతన తహశీల్దార్ ఆక్రమణలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంత వేగంగా స్పందిస్తారు అనే అంశాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

## వారపు సంత.... తాత్కాలిక మార్పు

**రేణిగుంట, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రేణిగుంట రైల్వే బ్రిడ్జి మరమ్మత్తుల కారణంగా ట్రాఫిక్ మళ్లింపుతో శనివారం జరిగే వారపు సంతను తాత్కాలికంగా మార్పు చేయాలని అధికారులు నిర్ణయించారు. ట్రాఫిక్ మళ్లించిన మార్గంలోనే సంత నిర్వహిస్తే ద్విచక్ర వాహనదారులు, వ్యాపారులు , ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కో వలసి వుంటుంది. ఈ నేపథ్యంలో, బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా రేణిగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వారపు సంతను నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ నిర్ణయంపై ఎంపీడీవో రవిచంద్ర, సి.ఐ. జయచంద్ర, పంచాయతీ సెక్రటరీ రమేష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా కలిసి సంత ప్రదేశం, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సంతలో పాల్గొనే రైతులు, అంగళ్లు పెట్టుకునే వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఈ శనివారం నుంచే తాత్కాలికంగా సంతను ఫ్లైఓవర్ కింద నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పట్టణ ప్రజలు, సంతకు వచ్చే వ్యాపారులు , కొనుగోలుదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని అధికారులు కోరారు. ఈ పర్యటనలో ఎస్.ఐ. ధర్మారెడ్డి, టిడిపి నాయకులు పుష్పనాదం, కన్నారెడ్డి, మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ తదితరులు పాల్గొన్నారు.




## టీటీడీకి బ్యాటరీ బగ్గీ విరాళం



**తిరుమల, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కర్ణాటక రాష్ట్రం కోలార్‌కు చెందిన హైడ్రోకార్ట్ టెక్నో సొల్యూషన్స్ సంస్థ ఎండీ గణేష్ జయవేల్ రూ.10 లక్షలు విలువైన బ్యాటరీ బగ్గీ వాహనాన్ని బుధవారం విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయం ఎదురుగా వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.



## రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి 90రోజుల కార్యాచరణ ప్రణాళిక

**-క్రీడాకారులు, క్రీడారంగ నిపుణుల అభిప్రాయాలను సేకరిస్తాం**
**-స్పోర్ట్స్ హబ్ గా రాయలసీమ హామీకి కట్టుబడి ఉన్నాం**
**- జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులతో మంత్రి నారా లోకేష్ భేటీ**

**తిరుపతి,ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై తిరుపతి స్పోర్ట్స్ స్టేడియంలో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులతో బుధవారం మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భం గా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 3,132 కి.మీల మేర యువగళం పాదయాత్ర చేపట్టినపుడు యువత ఆశలు, ఆకాంక్షలు తెలిశాయాని రాయలసీమను స్పోర్ట్స్ హబ్‌గా చేస్తానని ఇచ్చిన హామీ త్వరలో కార్యరూపం దాల్చుతుందన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ఏం చేయాలనే విషయమై గతంలో భారత మహిళా క్రికెట్ జట్టుతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద 421మందికి పైగా ఉద్యోగాలు సాధించారని,స్పోర్ట్స్ కోటా నుంచి వచ్చిన ఉపాధ్యాయుల ప్రతిభను క్రీడారంగ అభివృద్ధికి ఉపయోగించుకుంటామన్నారు. చంద్రబాబు హయాంలోనే హైదరాబాద్ లో స్పోర్ట్ విలేజ్ ఏర్పాటైన సంగతిని ఆయన గుర్తు చేస్తూ, ఇక్కడ నుంచే జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు వచ్చారని తెలిపారు. 90రోజుల యాక్షన్ ప్లాన్ లో రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి వరల్డ్ క్లాస్ బెస్ట్ మెకానిజం తయారుచేద్దామని పిలుపునిచ్చారు. అట్టడుగు స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని తెలియజేశారు. తిరుపతిలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో శాప్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన క్రికెట్ మైదానం చాలా బాగుందని, దీని నిర్వహణకు కార్పొరేట్ కంపెనీల సహకారం తీసుకుంటామని తెలిపారు.ఎన్నో సమస్యలు ఎదుర్కొని తమ ప్రతిభతో రాణిస్తోన్న జ్యోతి యర్రాజీ, శ్రీచరణి వంటి మహిళా క్రీడాకారిణులకు చేయూత నందిస్తామని తెలిపారు.

**ఫిట్నెస్ మెరుగుపరిచే చర్యలు చేపడతాం**

రాష్ట్రంలోని బాలలకు ఫిట్‌నెస్ లేకపోవడం క్రీడల్లో వెనుకబాటుకు ప్రధాన కారణంగా గుర్తించామని, దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ చర్యలతోపాటు తల్లిదండ్రుల సహకారం అవసరం అన్నారు. వ్యక్తిగతంగా కాకుండా వ్యవస్థీకృతంగా క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విశాఖ, విజయవాడ, తిరుపతి గ్రోత్ కారిడార్ల పరిధిలో క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారుచేస్తున్నామని వెల్లడించారు. క్రీడాకారులకు ఉద్యోగాల భర్తీలో న్యాయం జరిగేలా పారదర్శకత పాటిస్తున్నామన్నారు. క్రీడాకారులు అభిప్రాయాలన్నింటినీ డాక్యుమెంటేషన్ చేసి, 90రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేస్తామని మంత్రి ప్రకటించారు. ఈ భేటీలో అంతర్జాతీయ మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, షట్లర్ పివి సింధు, అర్జున అవార్డు గ్రహీత కరణం మల్లీశ్వరి, అథ్లెట్ యర్రాజీ జ్యోతి, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్ నమ్మాళ్వార్, ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి (బ్లైండ్ క్రికెట్), పంగి కరుణ కుమారి (బ్లైండ్ క్రికెట్), ముసునూరి రోహిత్ లలిత్ బాబు (చెస్), షేక్ అర్షద్ (పారా సైక్లింగ్), కిల్లాక లలిత (పారా అథ్లెటిక్స్), తమిరి సూర్య చరిష్మ (బ్యాడ్మింటన్), తిరుమూరి గణేష్ మణిరత్నం (ఆర్చరీ), దండు పూజ (బ్యాడ్మింటన్), పి.శివారెడ్డి (ఖోఖో), ఇ. రజని (హాకీ), నవ్య కందేరి (బ్యాడ్మింటన్), కె.ద్వారకనాథ్ రెడ్డి (బాస్కెట్ బాల్), శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొన్నారు.

## ఈట్ స్ట్రీట్ ను పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి,ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్ పనులను కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం సాయంత్రం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని హంగులతో ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్ ను గురువారం సాయంత్రం ప్రారంభించనున్నామని తెలిపారు. లక్కీ డిప్ లో దుకాణాలు దక్కించుకున్న వారికి తాళాలు కూడా ఇచ్చామని తెలిపారు. ఈట్ స్ట్రీట్ లో పూల కుండీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దుకాణాలు దక్కించున్న వారు అందరూ కూడా 16వ తేదీ నుండి నిర్వహించుకోవాలని తెలిపారు. ప్రజలకు పరిశుభ్రత తో కూడిన నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేలా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పిల్లల కొరకు ఆట స్థలం ఏర్పాటు చేశామని, ఐ లవ్ తిరుపతి పేరుతో సెల్ఫీ పాయింట్, వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేశామని తెలిపారు. కుటుంబ సమేతంగా వచ్చి ఆనందంగా ఆహార పదార్థలు స్వీకరించేలా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, డి. ఈ. లు వెంకట ప్రసాద్, శిల్ప, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

## తిరుపతి, చంద్రగిరిలలో అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి లోకేష్

**- తిరుపతిలో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం**
**- శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అకాడమీలకు ప్రారంభం**





**తిరుపతి,ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దుతామనే యువగళం హామీ కార్యరూపం దాలుస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో క్రీడాభివృద్ధికి ఏడాదిలో రూ.35 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గొల్లవాని గుంట లో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకాడమీలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. శాప్, తుడా సహకారంతో రూ.10.10 కోట్లతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించారు. ముందుగా క్రీడా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తో పాటు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ అకాడమీలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ క్రీడాకారులతో గ్రూప్ ఫోటో దిగారు. కొద్దిసేపు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంతో పాటు ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ ప్రారంభించి, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాల్ రాజ్, ఇతర క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు క్రికెడ్ ఆడారు. స్కూల్ విద్యార్థులతో సంభాషించి వారిని ఉత్సాహపరిచారు. క్రీడా ప్రాంగణంలో ప్రణీత్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. అంతకుముందు తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో రూ.5.35 కోట్ల వ్యయంతో కరణం మల్లీశ్వరి వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ, 200 మంది క్రీడాకారులకు వసతి సదుపాయం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన జూనియర్ బాక్సింగ్ రింక్ ను ప్రారంభించారు. గూడూరు నియోజకవర్గం కోటలో రూ.2.31 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం, సూళ్లూరుపేటలో రూ.2.70 కోట్ల వ్యయంతో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి, రేణిగుంట ఏపీఎస్టీఆర్ఈఐఎస్ స్కూల్‌లో రూ.80 లక్షల వ్యయంతో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ రవాణ, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ శ్రీపతి బాబు, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, సూర్య చరిష్మ తమిరి, దండు పూజ, నవ్య కందేరి, భారత అంధ క్రికెటర్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి, అంధ మహిళా క్రికెటర్ పంగి కరుణ కుమారి, పారా అథ్లెట్ రవి రంగలి, పారా సైక్లిస్ట్ షేక్ అర్షద్, పారా అథ్లెట్ కె.లలిత, ఆర్చరీ ప్లేయర్ టి.గణేష్ మణిరత్నం, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్‌ను అభినందించిన పనబాక లక్ష్మి



**తిరుపతి, ఏప్రిల్ 15 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు డాక్టర్ పనబాక లక్ష్మి తెలుగుదేశం పార్టీ నేషనల్ ప్రెసిడెంట్‌గా నియమితులైన రాష్ట్ర విద్య అండ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి, అభివృద్ధి దిశగా నారా లోకేష్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీకి యువతలో మరింత ఉత్సాహం, కొత్త దిశను తీసుకువచ్చే సామర్థ్యం నారా లోకేష్‌కి ఉందని, ఆయన నాయకత్వంలో పార్టీ దేశవ్యాప్తంగా బలపడాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, సాంకేతిక రంగ పురోగతిలో ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027